
జూన్ 2011
సంపుటి 5
సంచిక 2



ఎడిటర్ & పబ్లిషర్
సందిరెడ్డి కొండలరావు
కాకానిపాలెం, అద్దంకి.

Edited & Published and owned by
S. Kondala Rao
Akhil Publications
Kakanipalem, ADDANKI
Ph : 08593-223862
Cell : 98485 59566
e-mail : gundlakamma@yahoo.com
gundlakammas@gmail.com

and Printed at
Saswitha Graphics
Addanki


Layout & Design
Real image
Ongole
Mobile : 99485 17418

# గుండ్లకమ్మ

## సామాజిక రాజకీయ మాస పత్రిక

### విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | మహిళలు - మహరాణులు | 2 |
| 2. | కారాగారంలో కనిమొళి | 6 |
| 3. | అరుదైన ప్రజానాయకుడు యన్.జి. రంగా | 7 |
| 4. | ప్రపంచతత్వం - నాయకత్వం | 10 |
| 5. | గుండ్లకమ్మ కార్యాలయాన్ని సందర్శించిన దగ్గుబాటి దంపతులు | 14 |
| 6. | గుండ్లకమ్మ ప్రత్యేక సంచికను ఆవిష్కరించిన కేంద్రమంత్రి పనబాక లక్ష్మి | 15 |
| 7. | శృంగవరపుకోట ప్రజలకు రుణపడివుంటా | 16 |
| 8. | పాత్రికేయులు ప్రజాసమస్యలపై పోరాడాలి | 17 |
| 9. | బియ్యం ఎగుమతులపై చర్చించి నిర్ణయం | 18 |
| 10. | విద్యతో రుగ్మతలు దూరం | 19 |
| 11. | క్షమించండి... ప్లీజ్ | 20 |
| 12. | సిఎంలో కొత్త ధీమా | 22 |
| 13. | స్పీకర్‌గా నాదెండ్ల మనోహర్ | 23 |
| 14. | అవినీతి అంతుచూస్తా | 24 |
| 15. | నమ్మినబంటు వెంకన్న చౌదరి | 25 |
| 16. | శంఖుస్థాపన చేయువిధానం | 26 |
| 17. | తిరుక్కురళ్ - శ్రీవాణి | 28 |



గుండ్లకమ్మ పాఠకులకు,
ప్రకటన కర్తలకు,
ఏరువాక శుభాకాంక్షలు....
ఎడిటర్ & పబ్లిషర్

Owner, Published and edited by S. Kondala Rao published from Kakanipalem, Addanki - 523 201
and Printed at Saswitha Graphics, Opp. Rama Takies Street, Addanki. Editor S. Kondala Rao

కవర్ స్టోరీ

# మహిళలు - మహారాణులు

**ఇలపావులూరి మురళీమోహన్‌రావు** సెల్ : 98661 94944



**2011 సంవత్సరం ఏ విధంగా చూసినా స్వాతంత్ర్యానంతర భారత దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది. నలుగురు మహిళా మణులను ఏకకాలంలో వివిధ రాష్ట్రాలకు అధినేత్రులుగా చూసే మహదవకాశం ప్రపంచానికి కల్పించిన మహత్తరవత్సరం.** ఈ నలుగురులో ఢిల్లీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్‌ను మినహాయిస్తే మిగిలిన ముప్వురు... జయలలిత, మాయావతి, మమతాబెనర్జీ కరుడుగట్టిన నియంతలుగా 'ఖ్యాతి' గడించినవారు. అభిమానుల చేత ఆడపులులుగా కీర్తించబడినవారు. కఠోర పరిశ్రమ, పట్టుదల, అంకితభావం, మొండితనం, అనుకున్నది సాధించిన దాకా నిద్రపోని బండతనం వీరిలో నిండుగా, మెండుగా ఉన్న లక్షణాలు. వీరి ముగ్గురికీ గల మరో సామ్యం ఏంటంటే – ముగ్గురూ బ్రహ్మచారిణులు. వివాహానికి దూరంగా ఉన్నారు. రాజకీయాలలో అలుపెరుగని యోధులుగా వీరిని ప్రజలు గుర్తించి గౌరవించక తప్పదు. భారతదేశంలో అతిపెద్ద రాష్ట్రాలుగా భావించే ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, ఒక చిన్న రాష్ట్రం ఢిల్లీ మహిళల చేతుల్లో ఉన్నాయి. అనగా భారతదేశంలో గల నూటపదికోట్ల జనాభాలో దాదాపు ముప్పై అయిదు కోట్ల జనాభా నలుగురు మహిళల పరిపాలనలో ఉన్నారన్నమాట. ఇది ఎంతైనా గర్వించదగ్గ విషయం కదా! మహిళా సాధికారత విషయంలో భారతదేశం సాధించిన ప్రగతి అపూర్వం. ఇక్కడ మరో విశేషం ఏంటంటే ఒక్క షీలాదీక్షిత్ తప్ప మిగిలిన ముగ్గురు సర్వ స్వతంత్రులు. తమతమ పార్టీలకు వారే అధినేతలు. ఇప్పటికే కాదు. ఎప్పటికీనూ. బహుసమాజ్ పార్టీని కాన్షీరాం స్థాపించినా ఆయన అకాల మరణం వలన పార్టీ పగ్గాలు మాయావతి చేతికి చిక్కాయి. అంతే సంగతులు. ఆమె జీవించినంతకాలం ఇక ఆవిడే ఆ పార్టీకి అధినేత్రి. పదవిలో ఉన్నా లేకపోయినా, మాయావతిని పార్టీ అధ్యక్షపదవి నుంచి తప్పించడం హరిహర బ్రహ్మాదులకు కూడా సాధ్యం కాదు. అలాగే జయలలిత, అన్నా డి.యం.కె. పార్టీని స్వర్గీయం ఎం.జి. రామచంద్రన్ స్థాపించినా ఆయన మరణానంతరం చిన్నపాటి ఆధిపత్యపోరు జరిగినా, వారందరినీ అణగదొక్కి పార్టీ అధ్యక్షపదవిలో స్థిరపడిపోయింది. పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా, జయలలితను అధ్యక్ష్య పదవి నుంచి కదిలించడం విలయకారుడైన రుద్రుడికి కూడా అసాధ్యమే. వీరిద్దరితో పోలిస్తే మమతాబెనర్జీ విషయం కొంచెం విభిన్నమని చెప్పక తప్పదు. కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాలలోకి అడుగుపెట్టిన మమత నాటి ప్రధాని పీవీ నరసింహారావుతో వచ్చిన విభేదాల మూలంగా పార్టీ నుంచి వెళ్ళిపోయి తృణమూల్ కాంగ్రెస్ పార్టీని స్థాపించారు. అంటే తృణమూల్ కాంగ్రెస్

మమత సొంత ఆస్తిలాంటిది. ఆమె కంఠంలో ఊపిరి ఉన్నంతవరకు అవిడే ఆ పార్టీకి సర్వం సహా. ఈ ముగ్గురినీ ధిక్కరించిన వారెవరైనా ఎంతవారైనా పార్టీని వదిలిపెట్టి పోవాల్సిందే. ప్రజాస్వామ్యంలో ఇదొక నియంతృత్వం. రాజకీయ భవిష్యత్తు కోరుకునే వారెవరైనా భరించకతప్పదు. భారత దేశ రాజకీయాలను అత్యద్భుతంగా ప్రభావితం చేయగలిగిన ఈ నలుగురు మహిళల గురించి రేఖామాత్రంగా చర్చించుకోవడం సమంజసంగా ఉంటుంది.



## షీలాదీక్షిత్

షీలాదీక్షిత్ దాదాపు గత నలభై సంవత్సరాలుగా రాజకీయాలలో ఉన్నారు. షీలాకు నెహ్రూ కుటుంబంతో గల బాంధవ్యం, అత్తింటి వారి నేపథ్యం ఆమె రాజకీయ ప్రవేశాన్ని సులభతరం చేశాయి. ఆమె మామగారు ఉమాశంకర్ దీక్షిత్ నెహ్రూ, ఇందిరాగాంధి మంత్రివర్గాలలో పనిచేశారు. ఇందిరకు అత్యంత నమ్మకస్తుల్లో ఆయన ఒకరు. ఆయన మరణానంతరం రాజకీయాలలో పూర్తి స్థాయిలో పని చెయ్యనారంభించారు. అనుకోని పరిస్థితులలో ఢిల్లీ ముఖ్యమంత్రిత్వం షీలాకు లభించింది. సోనియాగాంధీ ఆశీస్సులు కూడా ఆమెకు పుష్కలంగా లభించడంతో ఆమెకు ఎదురే లేకుండా పోయింది. ఢిల్లీ పట్టణాభివృద్ధి మీద దృష్టి సారించి పరిపాలనను గాడిలో పెట్టి ఢిల్లీ ప్రజల జీవన ప్రమాణాలను పెంచడంలో విజయం సాధించడంతో – ఢిల్లీకి రెండో సారిముఖ్యమంత్రి కాగలిగారు. రెండోసారి కూడా అదే ఉత్సాహంతో ముందుకు పోవడంతో పార్టీలో, ప్రభుత్వంలో ఆమెకు తిరుగులేకుండా పోయింది. మూడోసారి ఎన్నికలు జరిగినప్పుడు కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం కష్టమని కొంతమంది రాజకీయ పండితులు భావించినా అందరి అంచనాలను తల్లకిందులు చేస్తూ మళ్ళీ విజయం సాధించి ఆశ్చర్యానికి గురిచేశారు. ఈ టర్మ్ కూడా పూర్తి చేస్తే ఒక రాష్ట్రాన్ని పదిహేను సంవత్సరాలు పాలించిన తొలి మహిళా ముఖ్యమంత్రిగా చరిత్ర సృష్టిస్తారు. హంగులు ఆర్భాటాలు ఏ మాత్రం నచ్చని షీలాదీక్షిత్ తక్కువ మాట్లాడి ఎక్కువ పనిచేసే ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్నారు. చుట్టూ భజన పరులను చేర్చుకోని అరుదైన నాయకురాలు షీలాదీక్షిత్ మహిళలకు ఆదర్శప్రాయురాలనడంలో సందేహం లేదు.

## మాయావతి

దళిత వర్గానికి చెందినవారు రాష్ట్రముఖ్యమంత్రులుగా ఎదగలేకపోతున్నారని మన రాష్ట్ర నాయకులతో సహా దేశనాయకులంతా మొసలి కన్నీరు



కారుస్తుంటారు. పోరాడగల దమ్ము, ధైర్యం ఉంటే దళితత్వం అనేది అడ్డు రాబోదని నిరూపించిన ఏకైక మహిళ మాయావతి. ఉత్తరప్రదేశ్ వంటి అతి పెద్ద రాష్ట్రాన్ని అగ్రవర్ణాల ఆధిపత్యం నుంచి తప్పించి అధికారం చేపట్టిన మొదటి దళిత మహిళ మాయావతి ఆమె గాడ్ ఫాదర్ కాన్షీరాం అస్వస్థతకు గురికాగానే పార్టీ పగ్గాలను చేబట్టి ఎన్నికలలో విజయం సాధించి రాష్ట్రముఖ్యమంత్రి అయ్యారు. మంత్రిగా అనుభవం లేకపోయినా అధికార యంత్రాంగం మీద పట్టుసాధించి ఐ.ఎ.యస్., ఐ.పి.యస్. వంటి ఉన్నతాధికారులను సైతం మూడు చెరువుల నీళ్ళు తాగించారు. చంచల మనస్తత్వం కావడంతో రాజకీయంగా ఒక సిద్ధాంతానికి బద్ధురాలు కాలేకపోయారు. ఒకసారి కాంగ్రెస్, మరోసారి బిజెపితో చెలిమి చేయడం, ఎవరైతే తన అధికార ప్రాప్తికి సహకరిస్తారో వారి గ్రూపులో చేరడం ఆమెకు అలవాటయింది. గతంలో రెండుసార్లు ముఖ్యమంత్రి అయినప్పటికీ పలు అవినీతి ఆరోపణల కారణంగా పూర్తికాలం పాలించలేకపోయారు. ఎవరో ఒక భాగస్వామి మద్దతు ఉపసంహరించుకోవడంతో అర్థాంతరంగా పదవిని వదులుకోవాల్సి వచ్చింది. ఉత్తరప్రదేశ్ ప్రజలు మాయావతి పట్ల సానుభూతి చూపడం వల్లనో ఏమో, గత ఎన్నికలలో ఆమెకు పూర్తి మెజారిటీని కట్టబెట్టారు. కనుక ఈ సారి మాత్రం ఆమె పూర్తి స్థాయి కాలాన్ని పరిపాలిస్తారు.

మరో పార్శ్వంలో చూస్తే మాయావతి ఎప్పుడు పాలించినా ఆమె మీద అనేక అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. తాజ్‌కారిడార్ కుంభకోణం ఇంకా ఆమె మెడ మీద కత్తిలా వేలాడుతూనే ఉంది. కేంద్ర ప్రభుత్వం తో విభేదాలు వచ్చినప్పుడు ఆ కేసు మళ్ళ బయటకొస్తుంది. ఇది కాకుండా కాన్షీరాం విగ్రహాలనే కాకుండా తన విగ్రహాలను సైతం ఆమె గ్రామగ్రామాన ప్రతిష్టించుకోవడం వివాదం సృష్టించింది. పుట్టినరోజులకు వేలాది కోట్ల రూపాయలను కానుకలుగా బహిరంగంగా స్వీకరించడం ఆమె తెంపరి తనానికి పరాకాష్ట. తను చెయ్యదలుచుకున్న కార్యాన్ని చెయ్యడంలో ఎవరినీ లక్ష్యపెట్టదు. జన్మతః అత్యంత పేదరాలైన మాయావతి గత ఎన్నికల సందర్భంలో ఆస్తుల విలువను ఏభై కోట్లకు పైగా చూపించింది. అవినీతి విషయంలో

కొమ్ములు తిరిగిన మగవారు సైతం ఆమె ముందు బలదూర్. ఆమెకున్న 'దళిత' కార్డు ఆమెను జైలు పాలుకాకుండా కాపాడే రక్షాకవచం. జయలలితను జైల్లో పెట్టినట్లు మాయావతిని జైల్లో పెడితే సగం భారతావని భగ్గుమంటుంది.

### పురచ్చితలైవి 'జయలలిత'

సినిమా రంగంలో మొదటి గ్లామర్‌హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్నది కాంచన అయితే, రెండవ గ్లామర్ హీరోయిన్‌గా ఖ్యాతి గడించింది జయలలిత. పుట్టుకతో



కన్నడిగురాలైనా, సినిమా హీరోయిన్‌గా ఆమెకు పేరు ప్రతిష్టలు తెచ్చింది తెలుగు, తమిళ రంగాలే. ఈ రెండు రంగాలలో అగ్రహీరోలుగా వెలుగొందిన ఎన్టీయార్, ఎయన్నార్, కృష్ణ, శోభన్‌బాబు, ఎంజీఆర్, శివాజీ, ముత్తురామన్ వంటి హీరోల సరసన నటించిన కీర్తి జయలలితది. తమిళరంగంలో తనకంటే ముప్ఫై సంవత్సరాలు పెద్దవాడైన ఎంజీఆర్‌తో అనేక సినిమాలలో నటించి, ఆయన రాజకీయ వారసురాలిగా ఎదిగిన జయలలిత జీవితం చాలా ఆశ్చర్యం కలిగిస్తుంది. ఎంజీఆర్ ఆమెను విపరీతంగా ప్రోత్సహించారు. ఎంజీఆర్ తరువాత ఆయన స్థానాన్ని ఆక్రమించాలని ఉవ్విళ్ళూరుతున్న ఆయన సహచరులకు ఇది కంటగింపుగా మారడంతో పార్టీలు లుకలుకలు ప్రారంభమయ్యాయి. దాంతో ఎంజీఆర్ జయలలితను రాజ్యసభకు పంపించారు. తన అందచందాలు, ఆంగ్లభాషా ప్రావీణ్యంతో ఆమె జాతీయ నాయకులను సమ్మోహనపరిచారు. ఇంతలో ఎంజీఆర్ హఠాన్మరణంతో రాష్ట్ర రాజకీయాలలో ప్రవేశించాలని ప్రయత్నించినా అనేక అడ్డంకులు ఎదురయ్యాయి. ప్రత్యర్థులు జయలలితను నిరోధించడం కోసం ఎంజీఆర్ భార్య జానకిని ముఖ్యమంత్రిని చేసినా అది మూడునాళ్ళ ముచ్చటగా ముగిసింది. డి.యం.కె. పార్టీ అధికారంలోకి వచ్చింది. నాటి అసెంబ్లీ నిండుకొలువులో డియంకె ఎమ్మెల్యేలు కొందరు జయలలిత చీర పట్టుకొని లాగడం ద్రౌపదీ వస్త్రాపహరణాన్ని తలపించింది. ఎలాగైనా డి.యం.కె.ను గద్దె దించుతానని శపథం చేశారామే. ఆ తరువాత జరిగిన ఎన్నికలలో పెద్ద మెజారిటీతో అధికారం సంపాదించారు. తరువాత ఎన్నికలలో ఓడిపోయినా 2001లో జరిగిన ఎన్నికలలో మళ్ళీ గద్దెనెక్కారు.




రెండుసార్లు ముఖ్యమంత్రిగా చేసినా జయలలిత మీద విపరీతమైన అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. టాన్సీ భూముల కుంభకోణం, జయపబ్లికేషన్స్ వ్యవహారం, కుమారుడి పెళ్ళికి వందలకోట్లు ఖర్చు చేయ్యడం, కిలోలకొద్దీ బంగారాన్ని ధరించడం. శశకళతో సాన్నిహిత్యం, చట్టానికి అతీతంగా వ్యవహరించడం ఆమెను అప్రతిష్టపాలు చెయ్యడమే కాక చివరకు జైలు ఊచలు కూడా లెక్కించాల్సివచ్చింది. 2006లో జరిగిన ఎన్నికలలో జయలలిత చిత్తుగా ఓడిపోయారు. మొన్న జరిగిన ఎన్నికలలో కూడా ఆమె గెలిచే అవకాశాలు లేవనే భావించారంతా. కానీ అనూహ్యంగా 2జి స్పెక్ట్రమ్ కుంభకోణంలో అధికార డి.యం.కె. పార్టీ పీకలలోతున కూరుకుపోవడంతో ఆమె తన పోరును ఉధృతంచేసి డి.యం.కె. అవినీతిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్ళగలిగారు. దాంతో మొన్నటి ఎన్నికలలో సునాయాసంగా... ఇంకా చెప్పాలంటే ఎగ్జిట్‌పోల్ సర్వేశ్వరుల అంచనాలను మించిపోయి సొంతంగా అసెంబ్లీలో మెజార్టీ సాధించి తిరిగి ముఖ్యమంత్రి కాగలిగారు.

జయలలిత మనస్సు ఎంత చంచలమైందో అంత కాఠిన్యపూరితం కూడా. ఎన్డీయేతో జతకట్టి వారిని మూడు చెరువుల నీళ్ళు తాగించారు. వాజ్‌పేయి ప్రభుత్వాన్ని పడగొట్టారు. ఎవరితో చెలిమి చేసినా, వారికి కంటిమీద కునుకు లేకుండా చెయ్యడం ఆమె ప్రత్యేకత. ఆమె పగబట్టిందంటే త్రాచుపాము కూడా ఎందుకూ పనికిరాదు. ఎనభై సంవత్సరాల వృద్ధుడని కూడా చూడకుండా కరుణానిధిని అర్ధరాత్రి వేళ అతి రాక్షసంగా అరెస్టు చేయించి పోలీస్‌స్టేషన్‌కు ఈడ్చుకెళ్ళడం, హిందువులందరూ పూజించే కంచికామకోటి పీఠాధిపతి స్వామి జయేంద్రసరస్వతిని వేలూరు జైల్లో నిర్బంధించడం. చిన్న తప్పుచేసినా ఎంతవారినైనా నిర్ధాక్షిణ్యంగా శిక్షించడం ఆమె కాఠిన్యమనస్తత్వానికి నిదర్శనం. బహిరంగ

సభల్లో మంత్రులు సైతం ఆమె పాదాలమీద పడుతుంటారు. ఒకసారి జయలలిత విశ్వాసాన్ని పోగొట్టుకుంటే తిరిగిపొందడం అసాధ్యం. ఎమైతేనేం? మెగాస్టార్‌గా పేరు తెచ్చుకొని ఒక్కసారి ఓటమికే కుంగాపోయి తన పార్టీని కాంగ్రెస్ పార్టీలో నిమజ్జనం చేసిన చిరంజీవితో పోలిస్తే – పోరాటాల ద్వారా అనుకున్నది సాధించే జయలలిత లక్షల రెట్లు మెరుగు. ఒంటిచేత్తో తొంభై సంవత్సరాల కరుణానిధిని ఆయన పార్టీని మట్టికరిపించిన జయలలిత ధీరవనిత అనడంలో సందేహం లేదు.

## మమతాబెనర్జీ

కేవలం 29 సంవత్సరాల వయసులో నాటి కమ్యూనిష్టు యోధుడు సోమ్‌నాథ్ చటర్జీని ఓడించడం ద్వారా లోక్‌సభలో ప్రవేశించిన మమతాబెనర్జీ బెంగాల్ రాజకీయాలలో ఒక సంచలనం. నిరాడంబరతకు మారుపేరుగా నిలబడిన మమతది చిన్నప్పటినుంచి పోరాడే మనస్తత్వం కలిగిన స్త్రీ. కాంగ్రెస్ పార్టీలో




నాయకురాలిగా ఎదిగినా, రాజీవ్‌గాంధీ, పీవీనరసింహారావు వంటి అగ్రనేతలతోనే కయ్యానికి కాలు దువ్వడం ఆమె విశిష్టత. పీవీ ప్రభుత్వంలో కేంద్ర సహాయమంత్రిగా పనిచేస్తున్న కాలంలో నాటి బెంగాల్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించి చివరకు అరెస్టు కాబడింది. ఆ సమయంలో పోలీసులు తనపట్ల దురుసుగా ప్రవర్తించడంతో మండిపడి ఎలాగైనా కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కూలగొడతానని శపథం చేసింది మమత. ఆ రోజు నుంచి రాష్ట్ర ప్రభుత్వాన్ని పడగొట్టడమే లక్ష్యంగా రాజకీయాలు నడిపారు. ఆ సాధనలో భాగంగా కాంగ్రెస్ నుంచి బయటకొచ్చి తృణమూల్ కాంగ్రెస్‌ను ఏర్పాటు చేశారు. కొన్నాళ్ళు యు.పి.ఎ. తోను, కొన్నాళ్ళు ఎన్డీఎతోనూ పొత్తులు నడిపారు. ఎవరితో చెలిమి చేసినా ఆమె అంతమ లక్ష్యం మాత్రం కమ్యూనిస్టు కోటను కూల్చడమే. అందుకోసం ఉద్యమాలు నడిపారు. సింగూర్, నందిగ్రామ్ భూముల వ్యవహారంలో బుద్ధదేవ్ ప్రభుత్వం నడిపిన వ్యవహారం కలిసొచ్చింది. రైతుల వద్ద నుంచి బలవంతంగా భూములు లాక్కోవడాన్ని వ్యతిరేకించి చివరకు టాటాలు బెంగాల్ నుంచి పారిపోయేట్లు చేశారు. కేంద్ర రైల్వే మంత్రిగా ఉండీ కూడా తన కమ్యూనిష్టు వ్యతిరేక ఉద్యమాన్ని ఆపలేదు. ఏ అవకాశాన్నీ వదులుకోలేదు. ఎవరెంత ఆక్షేపించినప్పటికీ రైల్వే బడ్జెట్లో సింహభాగం బెంగాల్‌కే తరలించారు. చివరకు మొన్న జరిగిన ఎన్నికలలో ముప్పైనాలుగు సంవత్సరాల కమ్యూనిస్టు పాలనకు చరమగీతం పాడారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. సగర్వంగా రైటర్స్ బిల్డింగ్ (సచివాలయం) లోకి ముఖ్యమంత్రిగా అడుగుపెట్టారు.

ఎదుటివాడు ఎంత పెద్దనాయకుడైనప్పటికీ – తనకు వ్యతిరేకంగా మాట్లాడితే సివంగిలా విరుచుకుపడడం ఆమె విశిష్టత. మన్మోహన్, సోనియా, ప్రణబ్ లాంటి అగ్రనాయకులు సైతం మమత అనుగ్రహం కోసం అర్రులు చాస్తున్నారంటే మమతా బెనర్జీ శక్తి ఏంటో అర్థమౌతుంది. కొసమెరుపేంటంటే – అధికారం చేపట్టగానే 'ఆరువందల ఎకరాలనిస్తాం రమ్మ'ని టాటాలకు ఆహ్వానం పలకడం – మమత పాలన ఎలా ఉండబోతుందో తెలియజేస్తుంది.

జయలలిత, మాయావతి, మమతా దీదీల రాజకీయ జీవితాల్లో కామన్‌గా కనిపించే లక్షణం ఒకటే. పరిస్థితులకు ఎదురీదడం. పోరాడటం, ఎన్ని ఆరోపణలొచ్చినా చలించకపోడం, ఎంతటి వారినైనా లెక్కచెయ్యకపోవడం, ఈ లక్షణాలే వారిని అందలం ఎక్కించాయి. ధీరత్వం తప్ప భీరత్వం అనేది వీరిలో మచ్చుకైనా కనిపించదు. పోరాటాలు చెయ్యడంలో మగవారికేమీ తీసోమని నిరూపించుకున్న వీరు అభినందనీయులు.

## మరి మన రాష్ట్రంలో ?

త్వరలో మన దేశంలో ఐదో మహిళా ముఖ్యమంత్రిని చూడబోతున్నామా? అది కూడా మన రాష్ట్రంలో సంభవించబోతుందా? ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డిని రాబోయే ఒకటి రెండు సంవత్సరాలలో తప్పించాల్సివస్తే కేంద్ర సహాయమంత్రి దగ్గుబాటి పురంధ్రీశ్వరిని ముఖ్యమంత్రి పదవి వరించే అవకాశాలున్నాయంటున్నారు. తన దీక్షా దక్షతలు వాగ్ధాటితో కాంగ్రెస్ పెద్దలను ఆకట్టుకున్న పురంధ్రీశ్వరి రాష్ట్రాధినేత్రి అయితే అది రాష్ట్రంలో కాంగ్రెస్ పటిష్టతకు, రాష్ట్రాభివృద్ధికి దోహం చేస్తుందనడంలో సందేహం లేదు.

చూద్దాం. ఏం జరుగుతుందో !



# కారాగారంలో కనిమొళి

**ఒక వంక ఒకే సమయంలో ఇద్దరు మహిళలు రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులౌతున్నారని మహిళా లోకమంతా గర్విస్తుంటే – అదే సమయంలో ఒక ప్రముఖ రాజకీయ కుటుంబానికి చెందిన మహిళ అవినీతి ఆరోపణలపై జైలు పాలుకావడం దేశాన్ని నివ్వెరపరిచింది.** డి.యం.కె. పార్టీ అధినేత, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి తన పదవి పోగొట్టుకున్న మరుసటి రోజే తన



గారాల కుమార్తె కనిమొళిని పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్తున్న దృశ్యాన్ని చూసి ఎంతో బాధపడి ఉంటాడు. మూలిగేనక్క మీద తాటిపండు పడటమంటే ఇదే కాబోలు! ఒక వేళ కరుణానిధి పార్టీ ఎన్నికలలో గెలిచి అధికారం తిరిగి చేపట్టి ఉండినా, 2–జి స్పెక్ట్రమ్ కేసు సుప్రీంకోర్టు పర్యవేక్షణలో కాక – కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో ఉండి ఉండినా ఇవాళ కనిమొళికి శ్రీకృష్ణ జన్మస్థాన సందర్శన అవసరం కలిగేది కాదేమో!

కరుణానిధి సంతానంలో కాస్తో కూస్తో విద్యాగంధం కలిగినది కనిమొళి ఒక్కతే. ఉన్నత విద్యావంతురాలైన కనిమొళి ఒక్కతే. ఉన్నత విద్యావంతురాలైన కనిమొళికి తండ్రి వారసత్వంగా సాహిత్య జ్ఞానం కూడా అబ్బింది. తమిళంలో ఆంగ్లంలో కవిత్వం రాసింది. అందుకే కుమార్తె అంటే కరుణానిధికి అపారమైన ప్రేమాభిమానాలు. పార్టీ సాంస్కృతిక విభాగానికి కనిమొళి అధిపతి. ఇద్దరు కుమారులు అళగిరి, స్టాలిన్ తనవారసత్వం కోసం కొట్టుకు చస్తూ మనశ్శాంతి లేకుండా చేస్తుంటే తమిళనాట రాజకీయాలలో కుమార్తెకు స్థానం దొరకదని భావించిన కరుణానిధి ఆమెను రాజ్యసభ సభ్యురాలిని చెయ్యడం ద్వారా జాతీయ రాజకీయాలలో ప్రవేశపెట్టాడు. అయితే అక్కడ ఆమె బుద్ధికుశలత వికసించడానికి బదులు వక్రమార్గం పట్టింది. తమ పార్టీలో కీలకనేతగా ఎదిగా కేంద్ర టెలికాం శాఖామంత్రిగా ఉన్న రాజాతో చేతులు కలిపి దేశంలోనే అతి పెద్ద కుంభకోణానికి తెరలేపింది.

2–జి స్పెక్ట్రమ్ కుంభకోణంలో వెనుకేసుకున్న సొమ్ములో రెండు వందల కోట్ల రూపాయలను తమ కుటుంబ ఆధ్వర్యంలో నడుస్తున్న కలైంజ్ఞార్ టీవీకి పెట్టుబడులుగా మలచడంలో కీలకపాత్ర పోషించింది. రాజా అరెస్టు జరిగిన తరువాత కనిమొళి అరెస్టు అనివార్యమే అయినా ఎన్నికల ఫలితాల వరకు ఎదురుచూసింది కేంద్ర ప్రభుత్వం. అప్పటి వరకు తూతూ మంత్రంగా కరుణానిధి కుటుంబ ఆస్తులపై సీబీఐ దాడులు జరిపించినా, ఎన్నికలలో డియం.కె తిరిగి గెలిస్తే తన మద్దతును యుపిఎ ప్రభుత్వానికి ఉపసంహరిస్తుందేమోనన్న భయం కాంగ్రెస్ నాయకత్వాన్ని వెంటాడిందన్న మాట వాస్తవం. అందుకే కనిమొళిని అరెస్టు చేయకుండా తాత్సారం చేసింది. ఎప్పుడైతే డీయంకె ఓడిపోయిందో, గెలిచిన జయలలిత స్నేహ హస్తాన్ని అందించడానికి సిద్ధమన్న సంకేతాలు పంపించిందో – ఇక ఏమాత్రం జడవకుండా కనిమొళి అరెస్టు చెయ్యడం జరిగింది. కన్న కూతురును పోలీసులు ఈడ్చుకెళ్తున్నా నిస్సహాయంగా చూస్తుండిపోవాల్సిన దుస్థితి కరుణానిధిది. మద్దతు ఉపసంహరించుకుంటే కేంద్రంలో డియంకె పార్టీకి చెందిన అందరి మంత్రి పదవులు ఊడిపోవడంతో పాటు రాష్ట్రంలో జయలలిత నుండి రక్షణ కరువౌతుంది. పైగా కేంద్ర ప్రభుత్వానికి – తమ మద్దతు ఉపసంహరించడం వల్ల వచ్చే ప్రమాదం ఏదీ లేదు. దాంతో కుడితిలో పడిన ఎలుకలా తయారైంది కరుణానిధి పరిస్థితి. ఎనభై ఏడు సంవత్సరాల పండు వయసులో కరుణానిధికి ఇంతటి దుస్థితి కలగడం కాలమహిమ కాక మరేంటి? 'సేతు సముద్రాన్ని నిర్మించిన నీలుడు ఏ ఇంజనీరింగ్ కాలేజ్‌లో చదివాడు' అని హేళన గా ప్రశ్నించిన



కరుణానిధికి రామబాణం దెబ్బ ఏంటో ఇపుడు తెలిసి ఉంటుంది. ఆయన బుద్ధి సక్రమంగా ఆలోచిస్తే!

భారతదేశం వంటి ప్రజాస్వామ్య దేశంలో చట్టం ముందు అందరూ సమానమే అని కనిమొళి, సురేష్ కల్మాడీ లాంటి వారి అరెస్టులు నిదర్శనంగా చెప్పుకోవచ్చు కానీ రాజకీయ నాయకులకు కొంచెం మినహాయింపు ఉంటుందని గతంలో అనేకసార్లు ఋజువైంది. ఇప్పుడూ అంతే.

**– ఇలపావులూరి మురళీమోహన్ రావు**

# అరుదైన ప్రజానాయకుడు ఆచార్య యన్.జి.రంగా

దేశం దేశమే శిరస్సు వంచి నమస్సు అందించే సుదినం. మనం మరువరాని, మరువగూడని వ్యక్తి ఆయన. ఆయనే మన ఆంధ్రుడు ఆచార్య రంగా. అరుదైన ప్రజానాయకుడు. అదొక అద్భుతతరం. ఆ తరానికి ప్రతినిధి మన ఆచార్యుడు. గాంధేయ సిద్ధాంతానికి ఆచరణలో అద్దం పట్టినతరం అది.



**ఆంధ్రుడు మన ఆచార్యుడు :** ఆ రోజుల్లో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేసి, ఆ డిగ్రీ ద్వారా ఆంగ్లేయుల పాలనలో పొందగల పదవులు, భోగభాగ్యాలు. సాధారణ స్థాయిలో వుండవుగదా! అన్నిటినీ ఆనాడు, ముఖ్యంగా ఆచార్య పదవిని తృణప్రాయంగా త్యజించిన వ్యక్తి యన్.జి.రంగా. స్వాతంత్ర్యానికి ముందు, స్వాతంత్ర్యానంతరం గూడా ప్రతిఫలం ఆశించని మహోన్నత నైతిక విలువలు గల గాంధేయవాది ఆయన.

**అపురూప త్యాగం :** భారతీ! మనకు వివాహం అయింది. అయితే, ఇతరులకు ఆదర్శం కావాలి. ప్రజాసేవకు నా దృష్టిలో ఒక పెద్ద అడ్డంకి, స్వార్థం, సర్వం ఇక్కడే ఘెరావో చేస్తూ వుంటాయి. తత్ఫలితంగా ఆపరేషన్ చేయించుకుందాం. క్షణాల్లో జరగవలసిందంతా చకచకా జరిగిపోయిందట! ఆ మేరు పర్వతం, వ్యక్తిత్వాన్ని కొలవడానికి మన దగ్గర కొలబద్ద లెక్కడ?

**కర్షకోద్యమ నిర్మాత, మహోన్నత స్థాయికి ఎదిగిన ఆనాటి పత్రికా విలేకరి :**

ఎన్.జి.రంగా అంటే రైతు రంగా. అంతకంటే మించిన ఆర్థికవేత్త. అంతేగాదు, కర్షకోద్యమ నిర్మాత. గొప్ప పార్లమెంటేరియన్. కొన్నేళ్ళపాటు ఒక ఇంగ్లీషు పత్రికకు విలేకరి. అన్నిటికంటే మించిన గొప్ప దేశభక్తుడు. అరుదైన ప్రజానాయకుడు ఆచార్య రంగా. ఆయన వ్యక్తిగాదు. మహాసంస్థ. ఆయన తన జీవితాన్నంతా ప్రజల కోసం, ప్రజా పోరాటాలు నిర్వహించేందుకే వెచ్చించారు. రైతులు, చేతివృత్తుల కళాకరులు, బుద్ధిజీవులు, ప్రజాస్వామిక శ్రేయోరాజ్యం రంగాజీ ప్రధాన ఆశయం. వారి అభివృద్ధి వికాసాలకు దోహం చేయగల రాజ్యాంగ వ్యవస్థ కిసాన్ మజ్దూర్, ప్రజారాజ్ స్థాపన ఆయన ధ్యేయం.

**సుదీర్ఘకాలం పార్లమెంటేరియన్ :**

1934 సెంట్రల్ లెజిస్లేచర్ సభ్యునిగా ప్రవేశించింది, మొదలు, 8 దశాబ్దాల సుదీర్ఘ పార్లమెంటరీ జీవితంలో వివిధ సమస్యలపై చేసిన ప్రసంగాల జాబితా క్రమసంఖ్య 20 పేజీలకు దాటిపోతుందంటే, ఆయన ఎటువంటి పార్లమెంటేరియన్? మనం అంచనా వేసుకోవచ్చు.

కరువు, కాటకాలు, తుఫాను, ఉప్పెనలు, అగ్నిప్రమాదాలు, సుడిగుండాలలాంటి జాతీయ వుపద్రవాలు సంభవించినపుడు, వాటి నివారణకు, బాధితుల సహాయానికి అంతర్జాతీయ రక్షణ నిధిని ఏర్పాటు చేయాలని, యునైటెడ్ నేషన్స్ ద్వారా, ప్రపంచ దేశాలకు ఒక విజ్ఞప్తి పత్రాన్ని అందజేసి అందుకొక అవిశ్రాంత పోరాటం, ప్రచారాన్ని కొనసాగించారు ఆచార్య రంగా. అంతేగాదు, ఒక గ్రంథమే ప్రచురించారు గూడా.

**యు.ఎన్.ఒ.లో రంగాజీ :**

1982లో యు.ఎన్.ఓ.కు రంగాజీ భారతప్రతినిధిగా నియమితులయ్యారు. అంతరిక్ష ప్రయోగాలు మానవాళి శాంతియుత ప్రయోజనాలకు మాత్రమే ఉపయోగకరంగా ఉండాలని, ప్రపంచ దేశాలన్నీ ఏకోన్ముఖంగా యీ అగ్రిమెంటుపై సంతకాలు జేయాలని ఆనాడే ఎన్.జి.రంగా ఎలుగెత్తి చాటారు.

**పత్రికా విలేకరిగా :**

1920–25 నాటిమాట. ఆక్స్‌ఫర్డ్‌లో రంగా విద్యార్థిగా వున్నారు. బ్రిటీష్ పార్లమెంటులో జరిగే కార్యకలాపాలను ప్రత్యక్షంగా వీక్షించి 4 సమీక్షా వ్యాసాలను

ఆంధ్రపత్రికకు పంపడం. ప్రచురించడం, ముఖ్యంగా ఆనాడే వేలాది పాఠకుల ప్రశంసలకు గురయ్యాయి. రంగాజీ రచనాపాటవాన్ని, శైలిని గమనించి దేశోద్ధారక, కాశీనాథుని నాగేశ్వరరావు గారు ఆంధ్రపత్రికకు ఇంగ్లాండులో రంగాజీని విలేకరిగా నియమించారట!

**కొండజాతుల సమస్యలపై :**

పచ్చయప్ప కళాశాలలో అధ్యాపక వృత్తిని చేపట్టిన ఎన్.జి.రంగా, తర్వాత మద్రాసు ప్రభుత్వ ఆర్థిక సలహాదారునిగా నియమించపబడ్డారు. విశ్రాంతిదినాలలో 1925లో నీలగిరి కొండ ప్రాంతాలకు వెళ్ళి కొండజాతుల మధ్య తిరుగుతూ వారి సమస్యలపై సరికొత్త గ్రంథాన్ని వ్రాసి ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారాయన.

**అపహాస్యం చేసినవారే :**

రంగాజీ ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ డి.లిట్ డిగ్రీ కొరకు సిద్ధాంతగ్రంథాన్ని వ్రాయవలసి వచ్చింది. తన అభిమాన విషయం, గ్రామీణ, ఆర్థిక, సాంఘిక, రాజకీయ సమస్యలను, తొటి ప్రొఫెసర్‌లతో రంగా చెప్పాడట! అయితే, ఆయనను మీ సబ్జెక్టు ? అని వారు అపహాస్యం చేశారట! రాత్రింబవళ్ళు రంగా అవిరళకృషి యిదే విషయంపై సిద్ధాంత గ్రంథాన్ని ప్రచురించినపుడు ఆనాడు అపహాస్యం చేసినవారే భళీ భళీ అని ప్రశంసించారట!

**హరిజనబాంధవుడు :**

విద్యార్థి దశలోనే కందుకూరి వీరేశలింగం, రాజారామ మోహన్‌రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్ లాంటి సంఘసంస్కర్తల ప్రభావం బలీయంగా వుంది. కులం, మతం, వర్ణం, వర్గం, మానవత్వానికే మాయనిమచ్చగా భావించారాయన. హరిజనులకు ఆర్థిక సహాయ, సహకారాలు, సహపంక్తి భోజనాలు చేస్తూ వుండే వారు. ఆనాటి పెద్దల అదిరింపులు, బెదిరింపులను రంగా లెక్కచేయలేదు. వారితో సైతం మానసిక మార్పుకు రాత్రింబవళ్ళు కృషి చేసి సఫలీకృతం చెందారు.

**సమీక్షావ్యాసాలు :**

ఉన్నవ లక్ష్మీనారాయణగారు రచించిన మాలపల్లి నవలపై సమీక్షావ్యాసాలకు అశేష ఆంధ్ర ప్రజానీకం ఆయనకు బ్రహ్మరథం పట్టింది. ముఖ్యంగా బ్రిటీషు ప్రభుత్వం ఆ సమీక్షా వ్యాసాలపై నిషేధం ప్రకటించిన సంగతి మనందరకు తెలిసిన విషయమే!

**హరిజన నాయకుడు అనే నవలారచన :-**

రంగాజీ 1933లో హరిజన నాయకుడు అనే సాంఘీక నవలను వ్రాసి, దానిలో యల్లమంద, గంగయ్య, రామస్వామి పాత్రల చిత్రీకరణలో ఆనాటి నవలాసాహిత్యంలో మైలురాళ్ళుగా తీర్చిదిద్దాడు. స్వయంగా మహాత్మాగాంధీని నిడుబోలుకు ఆహ్వానించి వారితో కాలినడకన పల్లెపల్లెలో పర్యటించి వారి ప్రధాన సమస్యలపై చర్చించారు.

**భారతీదేవి త్యాగం :**

గాంధీజీ హరిజన నిధి సేకరణ సందర్భంలో రంగాజీ భార్య తనశరీరంపై మంగళసూత్రంతో సహా బహూకరించిందట! హరిజనసేవలో ఆ దంపతులు నిర్వహించిన బహుముఖ పాత్రకు వేరే నిదర్శనాలు ఎందుకు?

**రైతులు - విప్లవఘాతకులు :**

కారల్ మార్క్స్ రైతులు విప్లవోద్యమాలకు పనికిరారని, సంఘటితశక్తి లేనివారని సిద్ధాంతీకరిస్తే అందుకు రంగాజీ ప్రపంచంలో ఆయా కాలాల్లో రైతాంగం వారి హక్కుల రక్షణకు, రాజకీయాధికారం కోసం సాగించిన పోరాటాలు, సాధించిన విజయాలను చారిత్రకదృష్టితో పరిశీలించి, పరిశోధించి విప్లవరైతాంగం అనే గ్రంథాన్ని వ్రాశారు. యీ గ్రంథ రచనకు ఎన్ని గ్రంథాలు పరిశోధించారో? ఎంత చరిత్రను త్రవ్విపోశారో మరి! యీ గ్రంథంపై ఒక పాత్రికేయుడు సమీక్ష చేస్తూ-

రంగా రాజకీయాలపై, ముఖ్యంగా ఆయన ఆలోచనా ధోరణిపై విభేదించవచ్చు. ఏకీభవించకపోవచ్చు. కానీ, యీ గ్రంథం మాత్రం రైతు, కూలీ, శ్రామిక, కార్యకర్తలకు, హిందువులకు భగవద్గీత, క్రైస్తవులకు బైబిల్, మహమ్మదీయులకు ఖురాన్‌లాంటిదని వ్రాశారట!

**బహుగ్రంథకర్త :**

ఆంధ్ర, ఆంగ్లభాషలలో ఆయన 100 కంటే ఎక్కువ గ్రంథాలు వ్రాశారు. వ్యాసాలు వ్రాశారు. వేలసంఖ్యలో ప్రసంగాలు చేశారు. ప్రతి సమస్య పరిష్కారం కోసం, ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించడం, దానిని ప్రజల మనస్సులలో చొప్పించడానికి తనకు అందుబాటులో వున్న పరిస్థితులను బట్టి



ప్రచురణ జరగవలసిందే! పంపిణీ చేయవలసిందే!

**ఎన్నెన్నో ప్రజావుద్యమాలు :**

రంగాజీ స్థాపించిన సంస్థలు, సాగించిన ప్రజోద్యమాలు, ప్రచురించిన గ్రంథాలు, రైతు రక్షణ యాత్రలు, వేసంగి రాజకీయ పాఠశాలలు, వయోజన విద్యా ప్రచారాలు, ప్రత్యర్థులలో, అసూయను, అసహనం, ఈర్ష్యాద్వేషాలు, పెరుగుతూ వుండేవి. ఆయనపై కుహనా విమర్శలు, నీలాపనిందలు, పత్రికలలో చోటు చేసుకుంటూ వుండేవట!

ఓర్పు, సహనం, విజ్ఞతగల ప్రతిభావంతుడు ఎన్.జి.రంగా. తనకోపమె తన శత్రువని వేమన, కబీర్‌ల సూక్తులను వుదహరిస్తూ ఉండేవారు.

**పరాజయంలో గూడా పట్టుదల :**

లోక్‌సభ ఎన్నికలలో పరాజయం పొందిన ఎన్.జి.రంగా నిరాశా, నిస్పృహలకు గురికాకుండా, ఓరుగల్లు కోట, రామప్ప దేవాలయాలను దర్శించారు. కాకతీయ చరిత్రను అధ్యయనం చేశారు. శాసనాలను పరిశీలించారు. రాణీసంయుక్త చరిత్రను కంఠస్థం చేశారు. ఆరునెలల్లో కాకతీయ చరిత్రను వ్రాసి ముద్రించారాయన. రాణీరుద్రమ, ఝాన్సీలక్ష్మి వీరోచిత పోరాటపటిమను పఠించి ఆనందబాష్పాలు రాల్చారాయన. సాంఘిక దురాచారాలు, కట్టుబాట్లు, సంకుచిత సమస్యలపై ధ్వజం ఎత్తేసమయంలో రంగాపై పలనాటి బ్రహ్మనాయుడు వీరబ్రహ్మేంద్రస్వామి, కందుకూరి, త్రిపురనేని రామస్వామి చౌదరిల ప్రభావం బలీయంగా ఉన్నట్లు స్పష్టమైన ఆధారాలు ఆ గ్రంథాలలోనే మనకు కనిపిస్తాయి.

**పాదచారిగా రంగాజీ :**


ఒక సుప్రసిద్ధ పాత్రికేయుడు వ్రాసినట్లు ఆయా రాజకీయాలతో విభేదించవచ్చు. ఆయన సిద్ధాంతాలు ఆలోచనా సరళితో మనం ఏకీభవించకపోవచ్చు. నైతిక విలువలు గల మహోన్నత వ్యక్తిగా, గొప్ప దేశభక్తునిగా గాంధేయతరానికి చెందిన యీ అరుదైన ప్రజానాయకుడు నిజంగా మనకు ఆంధ్రుడే మరి!

గ్రంథరచనలను బట్టి ప్రథమదశలో ఆర్థికవేత్తగా ద్వితీయదశలో పరిశోధకుడిగా, సిద్ధాంతకారునిగా తృతీయదశలో సూత్రకారునిగా, చతుర్దదశలో ఆదర్శ ప్రజాసేవకునిగా కనిపించే గోగినేని రంగనాయకులు (ఎన్.జి.రంగా) గుంటూరు జిల్లా నిడుబోలులో 1900 నవంబరు 7న జన్మించారు. ఆక్స్‌ఫర్డ్ లో పట్టభద్రు వచ్చారు. మద్రాసు పచ్చయప్ప కళాశాలలో ఆర్థికశాస్త్ర ప్రధానోచార్యులు 1931-36 కాలంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ మెంబర్‌గా, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులుగా, రైతాంగ విద్యాలయ స్థాపకుడిగా రాజ్యసభ, లోక్‌సభ సభ్యులుగా, వివిధ రంగాలలో ముఖ్యంగా ప్రజాసేవలో పునీతులై తన జన్మస్థలి నిడుబోలులో 1995 జూన్ 8న తనువు చాలించినపుడు ఆయనకు జరుగవలసిన రీతిలో కన్నీటి వీడ్కోలు జరగలేదని, ఆంధ్రుడు కావడమే యీ దురదృష్టమా? యీ వ్యక్తే ఏ బెంగాల్‌లోనో, ఏ మహారాష్ట్రలోనైతే ఎంత వీరపూజ జరిగివుండేదో మరి అంటూ ఆనాడుకొన్ని పత్రికలు విలుకాడి చేతి నుండి వదలిన బాణంలా వ్రాసిన వేడిమాటలు మనం మరువరాని, మరువగూడని విషయం.

**నిజమైన నివాళి :**

ఏది ఏమైనా యీ ఆచార్యుడు, అంతకంటే మించిన ఆర్థికవేత్త, అంతేగాదు, కర్షకోద్యమ నిర్మాత, అన్నిటికంటే మించిన గాంధేయతరానికి చెందిన గొప్ప దేశభక్తుడు, ఎన్.జి.రంగా శతజయంతిని ప్రభుత్వం అధికారికంగా జరపాలనే నిర్ణయానికి మనం జేజేలు చెప్పవలసిందే! ఇప్పటికైనా ఎన్.జి.రంగా పేరిట పోస్టల్ స్టాంపు విడుదల చేసి ఆయనకు భారతరత్న ప్రకటిస్తే ఆయనకు అందించే నిజమైన నివాళి యిదే!!

17వ వర్ధంతి సందర్భంగా...అరుదైన ప్రజానాయకుడు ఆచార్య యన్.జి.రంగాను మనం ఒక్కసారి స్మరించుకొని నిండు మనస్సుతో నివాళి అర్పించడం మన కర్తవ్యం.



**వలేటి వెంకటేశ్వర్లు**
రాష్ట్రపతి అవార్డు గ్రహీత
ఇంకొల్లు.




ఏరువాక పర్వదిన
శుభాకాంక్షలు....

ఎడిటర్
గుండ్లకమ్మ

పుస్తక సమీక్ష

# ప్రపంచతత్వం - నాయకత్వం


ఇక 'ప్రపంచతత్వం - నాయకత్వం' అను యీ గ్రంథం, విద్యార్థులు ఉపాధ్యాయులు, ఉద్యోగులు, అన్ని రాజకీయ పార్టీల కార్యకర్తలు మొదలు శాసనసభ్యులు మంత్రులతో సహా ప్రతి ఒక్కరూ తప్పక చదువ వలసిన గ్రంథం - కర్ర గలవాడిదే బర్రె, అండ గలవాడిదే కొండ అన్న ఆటవిక రాజ్యపు దశ నుండి, రాజకీయ నేటి సామ్యవాద, ప్రజాస్వామ్య దశకు చేరిందంటే, ఈ పరిణామం ఊరికే దానంతటదే వచ్చిందా? క్రీస్తు పూర్వం నుండి, నేటి దాక ఎందరెందరు తత్త్వవేత్తలు, రాజులు, చక్రవర్తులు, రాజనీతిజ్ఞులు, ప్రజాసేవా తత్పరులు, ఆ రాజకీయ క్షీరసాగరాన్ని మధిస్తే గాని ఈ సామ్యవాద ప్రజాస్వామ్యమనే అమృత దశకు మనం చేరుకోగలిగామన్నది నగ్న సత్యం! ఇలాంటి అమృత దశకు మనల్ని చేర్చిన వారిలో ఒక యాభైమంది ప్రముఖులను, వారి శక్తి యుక్తులను, వారి సాహసత్యాగాలను గూర్చి, క్లుప్తంగా, ఆసక్తికరంగా వివరించిన విశిష్ట గ్రంథమిది.




'ప్రపంచతత్వం-నాయకత్వం' అను యీ గ్రంథ రచయిత, బహుముఖ ప్రజ్ఞాశాలి డా॥ దగ్గుబాటి వెంకటేశ్వరరావు. ప్రపంచ అగ్రశ్రేణి రాజకీయ నేతల్లో గ్రంథపఠనం, గ్రంథ రచనలపై మక్కువ తపన కలిగినవారు - లెనిన్, స్టాలిన్, మావో సేటుంగ్, చర్చిల్, చార్లెస్ డిగాల్, నెహ్రూ మొదలగు ప్రముఖులు కొద్దిమంది మాత్రమే. రాజకీయంగా వారి స్థాయి కింకా ఎదగ లేదుగాని, పుస్తక పఠనం గ్రంథ రచనలపై వారికున్నంత మక్కువ, తపన డా॥ దగ్గుబాటికి కూడా వున్నాయన్నది వాస్తవం.


యాదృచ్ఛికమే గాని, స్టాలిన్, మవో సేటుంగ్‌ల వలె డా॥ దగ్గుబాటి కూడా డిసెంబరు నెలలోనే జన్మించారు. వీరిలో మవో సేటుంగ్ పెక్కు రచనలతోపాటు, చక్కని కవితలు గూడ వ్రాసిన మంచికవి గూడ. స్టాలిన్ చేసింది తక్కువ రచనలే గాని, జాతుల సమస్యలపై ఆయన వ్రాసిన గ్రంథం ప్రపంచ వ్యాపితంగా నేటికీ ప్రామాణిక గ్రంథంగా పరిగణింపబడుతుంది.

ఇక శ్రమించడంలో రచనలు చేయటంలో నెహ్రూగారికి, డాక్టర్ గారికి దగ్గరి




పోలికలున్నాయ్. నెహ్రూగారికి లాగే డాక్టరు గారిదీ శ్రమలోనే ఆనందం పొందే స్వభావం! నెహ్రూ గారు రోజుకు 17 గంటల పాటు అవిశ్రాంతంగా శ్రమించే వారట. అటు ప్రధానిగ, ఇటు కాంగ్రెస్ అధ్యక్షునిగ తన రోజువారీ పనులు పూర్తయ్యాక గూడ అర్ధరాత్రి రెండు గంటల దాకా చదువుకుంటూ, రచనలు చేసుకుంటూ వుండేవారట. అదేమంటే, 'మన అనుభవాలను, విజ్ఞానాన్ని భావితరాల వారికి, సమాజానికి రచనలు ద్వారా మాత్రమే సమగ్రంగా అందించగలం అనేవారట. మీకు విశ్రాంతి గూడ అవసరమని సలహా చెప్పే వారితో 'ఆరామ్ హరామ్ హై' అంటుండేవారట. ఆయన ప్రధానిగ ముఖ్యమంత్రలకందించదలుచుకున్న సందేశాలను గూడ తరచుగ పది, పన్నెండు పేజీల లేఖల రూపంలో వ్రాసి పంపేవారట. అలాంటి లేఖలు, స్వాతంత్ర్య పోరాట సమయంలో జైల్లో నుండే తన చిన్నారి ఇందిరకు వ్రాసిన వుత్తరాలతో సహా ఆయన రచనలన్నీ విజ్ఞాన నిధులుగ నేటికీ ప్రశంసలందుకుంటూనే ఉన్నాయ్.

**ఒకసారి డాక్టరుగారితో ఒక అభిమాని 'సార్ మీరు, మేడమ్ గారు పడుతున్న శ్రమను చూస్తుంటే మాకు చాలా బాధగా ఉంది. పురంధరేశ్వరి గారు సదా వైజాగ్, ఢిల్లీ, హైదరాబాద్, విదేశాలు, ఇతర రాష్ట్రాలకు, మీరు పర్చూరు, కారంచేడు, నియోజక వర్గంలోని గ్రామ గ్రామానికి, క్షణం తీరిక లేకుండా ఇద్దరూ బిజీ బిజీ. ఇక మీకు విశ్రాం తెప్పుడు? అని బాధగా ప్రశ్నించాడు. దానికి డాక్టరుగారు నవ్వుతూ 'క్షణం గూడ తీరిక లేకుండా శ్రమించే అవకాశం లభించటాన్ని దేవుడు మనకిచ్చిన వరంగా భావించాలి. అన్నారు. ఆ మాట వినగానే 'ఆరామ్ హరామ్ హై' అన్న నెహ్రూ గారి మాట గుర్తొచ్చింది. నెహ్రూ గారు రాత్రి రెండింటిదాకా వ్రాసుకొని పడుకుంటే, డాక్టారు గారు పదింటికి పడుకొని రాత్రి రెండు, మూడు గంటలకు లేచి రచనలు చేస్తుంటారు.**



కళ కళ కోసం కాదు, కళ ప్రజల కోసం అన్న నినాదంతో ప్రజానాట్య మండలి వారు సాగిపోతున్నట్లుగా 'రచనలు రచయిత కోసం కాదు, రచనలు సమాజ హితం కోసం' అన్న దృక్పధంతో డా॥ దగ్గుబాటి, **ఒక చరిత్ర – కొన్ని నిజాలు, తెలుగు వారి చరిత్ర – వేర్పాటు వాదం, ప్రపంచతత్వం – నాయకత్వం** అను మూడు విశిష్ట ప్రయోజనాత్మక గ్రంధాలనందించారు. ఇవి హిందీ, ఇంగ్లీషు భాషల్లోకి అనువదించ బడ్డాయి.

ఈ మూడు గ్రంధాలే గాక, ఆయన పార్లమెంటరీ బృంద నాయకునిగ, అమెరికా, రష్యా, చైనా, జపాన్, వియత్నాం, కంబోడియా, మలేషియా, ఈజిప్టు మొదలైన దేశాలలో పర్యటించి, ఆయా దేశాల రాజకీయ ఆర్థిక వ్యవస్థల పురోగమన, తిరోగమనాలను అందుకు గల కారణాలను విశ్లేషిస్తూ పత్రికా ముఖంగా పలువ్యాసాలు గూడ వ్రాసారు. ఆ వ్యాసాలతో పాటు ఐ.రా.స.లో నెల్సన్ మండేలాతో పాటు జాతి వివక్షతను నిరసిస్తూ ఆయన చేసిన ఆంగ్ల ప్రసంగం గూడ ప్రముఖుల ప్రశంసలు పొందింది.




అలా తనకు లభించిన ప్రతి అవకాశాన్ని, ప్రతి నిముషాన్నీ వృధా చేయకుండా, ప్రతి అంశాన్ని పరిగణిస్తూ పలు గ్రంథాలను చదువుతూ, అలా తను సముపార్జించిన అనుభవాలను, విజ్ఞానాన్ని, తన ప్రజలందరికీ పంచి పెట్టాలన్న తపనే, డా॥ దగ్గుబాటి చేత కలం పట్టించి వుంటుంది. ఆ తపనే లేకుంటే సదా ప్రజాసేవలో, ప్రభుత్వ కార్యకలాపాలలో మునిగి తేలుతూగూడ ఇలాంటి అద్భుత, ప్రయోజనాత్మక గ్రంథాలు వ్రాయటం సాధ్యమయ్యే పనేనా?


ఐతే దుర దృష్టవశాత్తు ప్రజా స్వామ్యంలోని లొసుగులను ఆధారంచేసుకొని స్వార్ధపరులు, అవినీతికి, అక్రమార్జనకు పాల్పడుతూ, ప్రజాస్వామ్య రాజకీయాన్ని వ్యాపార రాజకీయంగా దిగజార్చారు. ప్రస్తుతం మన మీ దౌర్భాగ్యపు రాజకీయాలలో కూరుకుపోయి వున్నాం. నేటి ఈ వ్యాపార రాజకీయ స్వరూపాన్ని ఒకసాదా సీదా రైతు యువకుడెలా సృష్టీకరించాడో చూద్దాం!

ఇటీవలే 'పామూరు' సెంటర్లో ఒకరోజు నేను బస్‌కోసం ఎదురుచూస్తుంటే జరిగిన సంఘటన ఇది. ఇద్దరు రైతు యువకులు రాజకీయం గూర్చి వాదించుకుంటున్నారు. వాళ్ళిద్దరిలో సంతకం చేతనైన కుర్రాడు, అదీగూడ చేతగాని రెండో కుర్రాణ్ణి గేలి చేస్తూ ఇలా అన్నాడు. ఒక సంతకం చేయ్యటం గూడ చేతగాని నువ్వు రాజకీయం మాట్లాడటమా? అసలు రాజకీయ మంటే అర్ధమేందో చెప్పరా ముందు, అని నిలదీసాడు. అందుకా రెండో కుర్రాడు రేయ్ రాజకీయ మంటే అర్ధమెంటో నాకు తెలియదు. కానీ ఇవ్వాళ జరుగుతున్న మన రాజకీయ మేంటో ఖచ్చితంగా చెప్పగలను విను – ఓట్లు కొని యం.యల్.ఎ. కావడం. అయ్యాక కోట్లు సంపాదించి మంత్రికావడం, తర్వాత వందల కోట్లు గడించి ముఖ్యమంత్రి కావడం – ఇక వేలు, లక్షల కోట్లు దండుకొని మళ్ళీ ముఖ్యమంత్రి కావటానికి పైవాళ్ళు, పార్టీ వాళ్ళు అడ్డుపడితే, సొంత పార్టీ పెట్టం ఇది మన రాజకీయం. సంతకం చేతగాని ఆ కుర్రాడు చెప్పిన జవాబుకు అక్కడున్న వాళ్ళంతా పకా పకా నవ్వుతూ చప్పట్లు గొట్టారు. ఒక పెద్దాయన ఆనందం పట్టలేక, ఆ కుర్రాడి దగ్గరకొచ్చి అతని రెండు చెంపల్ని తన రెండు చేతుల్తో నిమురుతూ, మా నాయనే, నీ తల్లి కడుపు చల్లగుండ, ఎంత బాగా చెప్పావయ్యా, వెనుకటికొకాయన కట్టె, కొట్టె, తెచ్చె అని రామాయణాన్ని మూడు ముక్కల్లో చెప్పినట్లుగా మూడు వాక్యాల్లో ఇమిడ్చి చెప్పావయ్యా అంటూ ఆ కుర్రాణ్ణి ప్రశంసించాడు.

మొత్తం మీద ఒక్క వామపక్షాల వారు తప్ప తక్కిన పాలకపార్టీల వాళ్ళంతా దేశవ్యాప్తంగా నెరుపుతున్న రాజకీయ తంతు ఇదే. భారత దేశంలోని రాజకీయాలపట్ల ఆ కుర్రాడి అభిప్రాయమే సగటు ప్రజలందరి అభిప్రాయమన్నది వాస్తవం. ఎందుకయ్యా, చక్కని ప్రజాస్వామ్య రాజకీయాన్నిలా వికృత వ్యాపార రాజకీయంగా దిగజార్చుతున్నారని సదరు రాజకీయ నాయకుల్ని ప్రశ్నిస్తే దానికి వాళ్ళు చెప్పే జవాబు, వెనుకటికో తాగుబోతు కుర్రాడు చెప్పిన జవాబును తలపిస్తుంది.

బహుశా అది ఇందిరాగాంధీ హయంలో జరిగిన సంఘటనగా గుర్తు. ఆ రోజుల్లో కుటుంబనియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న స్త్రీ, పురుషులకు కొంత డబ్బిచ్చే పథకం ఉంది. అది ఏప్రిల్ నెల ఒక రోజు ఉదయం నేను స్కూలుకెళ్ళే దారిలో ఒక పూరింటి ముందు తాగి పడుకున్న కుర్రాడి పక్కనే తల్లిదండ్రులు ఏడుస్తూ కనిపించారు. పరామర్శించుదామని దగ్గరకెళ్ళి ఇంత పొద్దున్నే సారా తాగావెందుకు? అన్నాను. ఆపరేషన్ చేసిన బాధను మర్చిపోయేందుకు తాగానన్నాడు. ఆపరేషనా? అన్నాను. ఔనయ్యా మాకు వీడొక్కడే కొడుకు, వీడూ పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకున్నాడయ్యా అంటూ నెత్తి బాదుకుంటూ పెద్దగా ఏడ్చారు తల్లిదండ్రులు. అదేంటి బాబూ పెళ్ళి కాకుండానే ఆపరేషనెందుకు చేయించుకున్నావ్ అన్నాను. తాగడానికి డబ్బుల్లేకపోతే మరేంజెయ్యమంటావండీ. అంటూ విసుగ్గా అసలు విషయం బయటపెట్టాడు.

సరిగ్గా నేటి మన పాలక పార్టీల రాజకీయ నాయకుల పరిస్థితి గూడ ఆ తాగుబోతు కుర్రాడి పరిస్థితిలాగే ఉంది. యం.యల్.ఎ., అయ్యి, కావడంతోటీ అక్రమార్జనకు ఎగబడుతున్నారు. అదేమిటని ప్రశ్నిస్తే మరి ఇలా ఆర్జించకపోతే మొన్నటి ఎన్నికల్లో పెట్టిన ఖర్చు, రాబోయే ఎలక్షన్లో పెట్టాల్సిన డబ్బు ఎక్కణ్ణుంచి వస్తుంది. అనడుగుతారు. పోనీ అంత డబ్బు పెట్టి ఆ పదవిని కొనుక్కోపోతే ఏమి? అనడిగితే,



ఆపదవే లేకుంటే అంత డబ్బెలా సంపాదించగలం. అని విసుక్కొంటూ వాళ్ళ ఆంతర్యాన్ని బయటపెట్టేస్తారు సదరు వ్యాపార రాజకీయనాయకులు. కాబట్టి సగటు ప్రజల్లోని, సగటు రాజకీయ నాయకుల్లోని రాజకీయం పట్ల గల దురభిప్రాయాన్ని, దుర్లక్ష్యాన్ని తొలగించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. అందుకు అసలు రాజకీయం యొక్క సదాశయం ఏమిటో, ఆ సదాశయ సాధన కోసం ప్రపంచ వ్యాప్తంగా మహనీయులు చేసిన త్యాగాలను, సాహసాలను ప్రజలకు నాయకులకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదిగో ఆ కర్తవ్యాన్ని నెరవేర్చగల గ్రంథమే. ప్రపంచ తత్వం – నాయకత్వం అగు గ్రంథం.

ఈ గ్రంథం క్రీస్తు పూర్వపు సోక్రటీస్, అరిస్టాటిల్, క్రీస్తు శకపు హేగెల్, మార్క్స్, ఎంగెల్స్, వోల్టేర్, రూసో మొదలగు తత్వవేత్తలు లేక రాజనీతిజ్ఞులు – క్రీస్తు పూర్వం నుండి అలెగ్జాండర్, జూలియస్ సీజర్, చెంఘిజ్‌ఖాన్, 8వ హెన్రీ, 14వ లూయీ నెపోలియన్, చులలోంగ్ కోర్న్ మొదలగు చక్రవర్తులు, రాజులు తమ త్యాగాలు, సాహసాల ద్వారా ఆయా రాజ్యాలకు ప్రపంచానికి సపాధించి పెట్టిన ప్రగతిని తెలియజేస్తుంది.

తమతమ దేశాల విముక్తి కోసం తమ సర్వస్వాన్ని అర్పించి పోరాడి తమ దేశ ప్రజల హృదయాల దేవాలయాలలో ఆ జాతి పితలుగా కొలువుండిపోయిన వాషింగ్టన్, సైమన్ బొలీవర్, నెపోలియన్, బిస్మార్క్, ముత్సు హిటో, మహాత్మాగాంధీ, బెన్‌గురియన్, మహమ్మదాలీజిన్నా, నెల్సన్ మండేలా, యాసర్ ఆరాఫత్ మొదలగు మహనీయుల మహత్తర త్యాగాలను వెల్లడిస్తుంది.

రాజుల అధికారాలను, అధికార స్వభావాలను ప్రజాస్వామ్యం వైపు మళ్ళించిన సన్యట్‌సేన్, జాన్ లాక్, అబ్రహం లింకన్, రూసో మొ॥ రాజనీతిజ్ఞుల గూర్చి నవభారత నిర్మాత నెహ్రూ, మానవతావాది బెర్ట్రండ్ రస్సెల్, సాహిత్య నోబెల్ బహుమతీ గ్రహీత చర్చిల్, ఫ్రాన్స్ చర్చిల్‌గా ఖ్యాతిగాంచిన చార్లెస్



డిగాల్ మొ॥ రచయితలు మేధావులైన రాజకీయనేతల గూర్చి మరియు కారల్ మార్క్స్, ఫెడరిక్ ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్, మావో, హూచ్‌మిన్, కిమ్‌ఇల్ సంగ్, కాస్ట్రో, చెగువేరా మొదలగు వారి అపూర్వ కృషిత్యాగాలను గూర్చి అలాగే చైనా ఆర్థిక రథానికి సోషలిజం, కేపటలిజం అను రెండు రకాల అశ్వాలను గూర్చి దాన్ని ప్రగతి పథాన పరుగెత్తించిన డెంజియావోపింగ్ లాంటి సరికొత్త ప్రయోగ కర్తలను గూర్చి తెల్పడమే గాక చరిత్ర గతిని వెనక్కు మళ్ళించేందుకు ప్రయత్నించి విఫలం చెందటమే గాక హిట్లర్, ముస్సోలినీలు ఎంతటి దయనీయ మరణానికి గురయ్యారో తెలుపుతూ అలాంటి వారిని తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరిస్తుంది ఈ గ్రంథం.

ఇక రచయితలకు గూడ నా సూచన ఏమంటే ఈ ఒక్క పుస్తకాన్ని దగ్గరుంచుకుంటే, యాభైమంది ప్రముఖుల జీవిత చరిత్రలను సమకూర్చుకున్నట్లే కాగలదు. ప్రపంచ రాజకీయ తత్వాన్ని పరిణామ క్రమాన్ని అందుకు త్రికరణ శుద్ధిగా శ్రమించిన మహనీయుల వివరాలను అద్దంలో చూపినంత స్పష్టంగా, క్లుప్తంగా చూపించగల ప్రపంచతత్వం, నాయకత్వం అను ఈ అద్భుత ప్రయోజనాత్మక గ్రంధాన్ని మనకిందించిన పర్చూరు శాసనసభ్యులు డా॥ శ్రీ దగ్గుబాటి వెంకటేశ్వరరావు గారికి హృదయపూర్వక అభినందనలు. మరియు కృతజ్ఞాభివందనాలు. వారి కమనీయ కలం నుండి మరిన్ని సమాజహితైక సద్గ్రంధాలు జాలు వారాలని ఆకాంక్షిస్తూ ఎదురు చూస్తుందాం.

**– పాతూరి వెంకటేశ్వరరావు**


# "గుండ్లకమ్మ" ప్రత్యేక సంచికను ఆవిష్కరించిన కేంద్రమంత్రి పనబాక లక్ష్మి



కేంద్ర మానవవనరుల శాఖా సహాయమంత్రి డా॥ దగ్గుబాటి పురంధ్రీశ్వరి జన్మదినం సందర్భముగా గుండ్లకమ్మ మాస పత్రిక వెలువరిచిన ప్రత్యేక సంచికను కేంద్ర చేనేత జౌళి శాఖాసహాయమంత్రి పనబాక లక్ష్మి ఆవిష్కరించి తొలి సంచికను పురంధ్రీశ్వరిగారికి అందజేశారు.

ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం, పెద్దకొత్తపల్లి గ్రామములో జరిగిన ఈ కార్యక్రమములో పనబాక లక్ష్మి మాట్లాడుతు గ్రామీణ ప్రాంతమైన అద్దంకి నుండి వెలువడుతున్న గుండ్లకమ్మ మాస పత్రిక నాణ్యంగా అత్యంత విలువైన సమాచారంతో వెలువడుతూ, రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక సర్కులేషన్ కలిగి పాఠకుల విశేషఆధరాభి మానాలు పొందుతున్నదన్నారు.

అందుకు కృషిచేస్తున్న పత్రిక ఎడిటర్ సందిరెడ్డి కొండలరావును ఆమె ప్రత్యేకంగా అభినందించారు. కేంద్రమంత్రి పురంధ్రీశ్వరి మాట్లాడుతూ తన జన్మదిన సందర్భముగా చక్కని ఫోటోలు, ప్రత్యేక వ్యాసాలతో, ప్రత్యేక సంచికను వెలువరిచినందుకు ఎడిటర్ కొండలరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమములో ఇంకా సంతనూతలపాడు శాసనసభ్యులు బి.యన్. విజయ్‌కుమార్, పర్చూరు శాసనసభ్యులు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, సెంట్రల్ బ్యాంక్ ఛైర్మన్ మేదరమెట్ల శంకరారెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ ఘట్టినేని అయ్యన్న, మద్దిపాడు ఎ.యం.సి. ఛైర్మన్ మారం వెంకారెడ్డి, ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల అధినేత కంచర్ల రామయ్య, రైజ్ గ్రూప్ కాలేజి ఛైర్మన్ ఐ.సి. రంగమన్నార్ తదితరులు పాల్గొన్నారు.



★★★★★

# గుండ్లకమ్మ పత్రిక కార్యాలయాన్ని సందర్శించిన దగ్గుబాటి దంపతులు



అద్దంకిలోని గుండ్లకమ్మ మాసపత్రిక కార్యాలయాన్ని కేంద్రమంత్రి దగ్గుబాటి పురంధ్రీశ్వరి, పర్చూరు శాసన సభ్యులు దగ్గుబాటి వెంకటేశ్వరరావులు సందర్శించారు. ఈ సందర్భముగా కార్యాలయంలో కంప్యూటర్ విభాగాన్ని ఎడిటోరియల్, సర్క్యులేషన్, మార్కెటింగ్ విభాగాలను వారు పరిశీలించి పనితీరు విధానాన్ని తెలుసుకున్నారు.

ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి అత్యంత నాణ్యమైన విలువలతో పత్రికను గత 9 సంవత్సరాలుగా నడుపుతున్న పత్రిక సంపాదకులు సందిరెడ్డి కొండల రావును వీరు అభినందించారు.



# శృంగవరపుకోట ప్రజలకు రుణపడి ఉంటా

## కేంద్రమంత్రి పురందేశ్వరి



తానెవరో తెలియకపోయినా 30 వేల మెజార్టీని ఇచ్చి తన గెలుపునకు దోహదపడిన శృంగవరపుకోట నియోజకవర్గ ఓటర్లు, ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని కేంద్రమంత్రి, విశాఖపట్నం లోక్‌సభ సభ్యురాలు డాక్టర్ దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. కొత్తవలన మండలం మంగళపాలెంలో శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్టు నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. ఈ నియోజకవర్గ ప్రజలను మర్చిపోతే కృతజ్ఞహీనురాలినవుతానన్నారు. మొదట బాపట్ల సీటు ఖరారైనా తర్వాత విశాఖపట్నం నుంచి ప్రాతినిధ్యం వహించాలని అధిష్ఠానం ఆదేశించడంతో ఇక్కడ పోటీచేసినట్లు ఆనాటి సంగతులను గుర్తుచేశారు. అప్పట్లో అందరూ స్థానికేతరురాలు అంటూ తెరపైకి తీసుకువచ్చారని అయినా తనపై నమ్మకంతో ప్రజలు గెలుపించారన్నారు. ఎన్టీఆర్ కుమార్తెగా, కాంగ్రెస్ పార్టీ సభ్యురాలుగా ఈ ప్రాంత అభివృద్ధికి తన సాయశక్తులా కృషి చేస్తానని ఆమె ప్రకటించారు.

**వికలాంగులకు సేవలు అభినందనీయం**

వికలాంగుల జీవితాల్లో సంతోషాన్ని కలిగించాలని, సహాయం చేయాలని మంగళపాలెం శ్రీగురుదేవ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు రాపర్తి జగదీష్‌బాబు చేస్తున్న సేవలు అభినందనీయమని కేంద్రమంత్రి, విశాఖ లోక్‌సభ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. మంగళపాలెంలో ట్రస్టు ఆధ్వర్యంలో కృత్రిమ అవయవాల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గత అయిదేళ్ళుగా వికలాంగులకి ఉచితంగా కృత్రిమ అవయవాలు అందించడమే కాకుండా సర్వమత సమనత్వాన్ని పాటిస్తూ అందిస్తున్న సేవలను కొనియాడారు. పేదల సంక్షేమం, అభివృద్ధికోసం ప్రతీ ఒక్కరూ పాటుపడాలని ఆమె కోరారు.

**రహదారి అభివృద్ధికి వినతి :** మంగళపాలెం నుంచి ట్రస్టుకు చెందిన కృత్రిమ అవయవాల కేంద్రానికి ఉన్న రహదారి అభివృద్ధి చేయాలని కోరుతూ కేంద్ర మంత్రి పురందేశ్వరికి విశాఖపట్నం ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ వినతి పత్రం అందజేశారు. ట్రస్టు చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు. విశాఖకే చెందిన మరో ఎమ్మెల్యే మళ్ళ విజయప్రసాద్ మాట్లాడుతూ మంగళపాలేనికి రక్షిత మంచినీటి పథకాన్ని మంజూరు చేయాలని కోరారు. శృంగవరపురోట నియోజకవర్గ ఇన్‌చార్జి అల్లు జోగినాయుడు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో వెన్నుముక కోల్పోతున్న వారి కోసం విశాఖలో సీఎంసీ క్యాంపస్‌ను ఏర్పాటు చేయాలని మంత్రికి విజ్ఞప్తిచేశారు. కొత్తవలన మండలాధ్యక్షుడు పి.రాజన్న మాట్లాడుతూ శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్టు అందిస్తున్న సేవలు వల్ల మంగళపాలెంతో పాటు కొత్తవలస మండలానికి మంచిపేరు వస్తోందని చెప్పారు. డిసిసి మాజీ ఉపాధ్యక్షుడు నెక్కల నాయుడు బాబు మాట్లాడుతూ ట్రస్టు ద్వారా జగదీష్‌బాబు అందిస్తున్న సేవలు చిరకాలం కొనసాగేలా కేంద్రం నిధులు మంజూరు చేయించాలని మంత్రి పురందేశ్వరిని కోరారు. ఈ సందర్భంగా 29మంది వికలాంగులకు కృత్రిమ కాళ్లు, పనిచేసే చేయి, పోలియో వ్యాధిగ్రస్తులకు కేలిపర్స్ అందచేశారు. వృద్ధులు, అంధులు, నిరుపేదలకు ట్రస్టు తరుఫున పింఛన్లు, దుప్పట్లు, చీరలను కేంద్ర మంత్రి పురందేశ్వరితో పాటు వక్తలంతా పంపిణీ చేశారు.

**నళినేష్‌బాబుకి సన్మానం :** రెండు కాళ్ళు పోగొట్టుకొని తనలాంటి వికలాంగులకు కృత్రిమ అవయవాలు తయారుచేసి అందిస్తూ వారిలో ఆత్మస్థయిర్యాన్ని నింపుతున్న కృత్రిమ అవయవాల తయారీ నిపుణుడు, ట్రస్టు వైస్ ఛైర్మన్ గూడూరి నళినేష్‌బాబును ఈ సందర్భంగా మంత్రి పురందేశ్వరి సన్మానించారు. అనంతరం ట్రస్టు తరుఫున కేంద్రమంత్రి పురందేశ్వరిని ఛైర్మన్ జగదీష్ బాబు తదితరులు సన్మానించి, జ్ఞాపికను అందించారు. అంతకుముందు ట్రస్టు నిర్వహిస్తున్న కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాన్ని మంత్రి సందర్శించారు.

☆☆☆☆☆

# పాత్రికేయులు ప్రజా సమస్యలపై పోరాడాలి

**— కేంద్రమంత్రి పురందేశ్వరి —**

పాత్రికేయులు ప్రజాసమస్యలపై పోరాడుతూ ప్రభుత్వాన్ని మేల్కొలిపేలా బాధ్యతలు నిర్వహించాలని కేంద్రమంత్రి డి.పురందేశ్వరి సూచించారు. వైజాగ్ జర్నలిస్ట్ ఫోరం ఆధ్వర్యంలో వీజేఎఫ్ నిర్వహించిన స్పోర్ట్‌మీట్ బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం వుడా బాలల థియేటర్‌లో నిర్వహించారు. పాత్రికేయ వృత్తి ఒత్తిడితో కూడుకున్నదని, మానసిక ప్రశాంతత అవసరమన్నారు. శారీరకంగా ఆరోగ్యంగా ఉంటే మానసిక ఉల్లాసం కూడా కలిగి సమాజానికి ఉపయోగపడే కథనాలను అందించగలరన్నారు. ఈ వృత్తిలోకి ప్రవేశించే వారికి పూర్తిస్థాయిలో శిక్షణ అందించి అన్ని విధాలుగా సన్నధం చేస్తే ప్రజా సమస్యలపై మంచి సంకల్పంతో పోరాడతారన్నారు. అనంతరం వీజేఎఫ్ నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ముందుగా ముంబయి, ఒడిశా ప్రాంతాలకు చెందిన కళాకారులు ప్రదర్శించిన కథక్, ఒడిస్సీ నృత్యాలు ఆకర్షణగా నిలిచాయి. పలువురు పాత్రికేయులు మాట్లాడుతూ ప్రభుత్వం తమకు కల్పిస్తామన్న ఇళ్ల సౌకర్యాలను వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈపీడీసీఎల్ సీఎండీ నదీమ్ అహ్మద్, వుడా వీసీకోన శశిధర్, పశ్చిమ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్, సి.ఎం.ఆర్. అధినేత మావూరి వెంకటరమణ, ఈపీడీసీ ఎల్ డైరెక్టర్ హెచ్.వై.దొర, కోకోకోలా బెవరేజస్ జనరల్ సేల్స్ మేనేజర్ విష్ణువర్ధన్ రెడ్డి, వీజేఎఫ్ అధ్యక్షులు యుగంధర్ రెడ్డి, కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు పాల్గొన్నారు.

★★★★★



# బియ్యం ఎగుమతులపై చర్చించి నిర్ణయం
# ముఖ్యమంత్రి బృందానికి ప్రణబ్ హామీ



వరి మద్దతు ధర పెంపు, విదేశాలకు బియ్యం ఎగుమతుల అంశంపై తీవ్రంగా ఆలోచిస్తున్నామని కేంద్ర ఆర్థికమంత్రి ప్రణబ్ ముఖర్జీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి బృందానికి హామీ ఇచ్చారు. ఎగుమతులపై మంత్రివర్గ ఉపసంఘంలో, మద్దతు ధర పెంపుపై మంత్రివర్గ సమావేశంలో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలో కేంద్రమంత్రులు పురందేశ్వరి, పనబాక లక్ష్మి, ఎంపీలు కావూరి సాంబశివరావు, మాగుంట శ్రీనివాసరెడ్డి, మధుయాష్కీగౌడ్, హర్షకుమార్, వి.హనుమంతరావు, సుబ్బరామిరెడ్డి, జె.డి.శీలంలతో కూడిన బృందం ఆర్థిక మంత్రిత్వశాఖ కార్యాలయంలో ప్రణబ్ ముఖర్జీని కలిసింది. సుమారు 15 నిమిషాలపాటు ఆయనకు రైతుల సమస్యలను ఏకరువుపెట్టింది. వ్యవసాయ ఖర్చులు పెరిగి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, గోదాముల్లో స్థలాభావం కారణంగా ధాన్యం సేకరణలో తలెత్తుతున్న ఒడిదుడుకుల గురించి ముఖ్యమంత్రి ఆర్థికమంత్రికి వివరించారు.

రాష్ట్రంలో దాదాపు 140 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించాల్సిన తరుణంలో గోదాములు ఖాళీ చేయించడానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. 25 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతులకు అవకాశం కల్పిస్తే గోదాములు ఖాళీ కావడంతోపాటు రైతులకు గిట్టుబాటుధర లభిస్తుందని ముఖ్యమంత్రి వివరించారు. మిల్లర్లు రైతుల నుంచి పూర్తిగా ధాన్యాన్ని సేకరించక ముందే ఎగుమతులకు అవకాశం ఇస్తే రైతులకు ప్రయోజనం కలుగుతుందని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర రైతాంగం ఎదుర్కొంటున్న ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తక్షణం నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఇందుకు ప్రణబ్ ముఖర్జీ సానుకూలంగా స్పందించినట్లు ముఖ్యమంత్రి వెంట వెళ్ళిన ఎంపీల బృందం సభ్యులు తెలిపారు. "నాకు అన్నీ తెలుసు.

మీరు ఇదివరకూడా ఈ విషయం మా దృష్టికి తెచ్చారు. మేం కూడా సీరియస్‌గానే ఆలోచిస్తున్నాం. అయితే మనం తెస్తున్న ఆహారభద్రత చట్టం వల్ల 72 శాతం మందికి చట్టబద్ధంగా ఆహారం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. అప్పుడు సబ్సిడీకి భారీ మొత్తం ఖర్చు పెట్టాల్సి వస్తుంది. కాబట్టి ఆ విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకొని దీనిపై నిర్ణయం తీసుకుంటాం" అని ప్రణబ్ అన్నట్లు బృంద సభ్యులు పేర్కొన్నారు.

★★★★★

# విద్యతో రుగ్మతలు దూరం

## కేంద్ర మానవవనరుల శాఖ సహాయమంత్రి పురంధేశ్వరి

**ఎల్.ఎం.డిలో కేంద్రీయ విద్యాలయం ప్రారంభం**
**చొప్పదండిలో నవోదయ సందర్శన**

మహిళలపై, హింస.. భ్రూణ హత్యలు, వరకట్నం వంటి సామాజిక రుగ్మతలను దూరం చేసే దివ్యౌషధం విద్యేనని కేంద్ర మానవ వనరుల శాఖా సహాయ మంత్రి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. కరీంనగర్ జిల్లా, తిమ్మాపూర్ మండలం ఎల్.ఎం.డిలో కేంద్రీయ విద్యాలయాన్ని నగరంలోని మహిళా డిగ్రీ కళాశాలలో రూ.కోటితో నిర్మించిన వసతి గృహాన్ని, చొప్పదండిలో నవోదయ పాఠశాలలో డైనింగ్ హాలును ఆమె ప్రారంభించారు. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమాల్లో పురందేశ్వరి మాట్లాడుతూ మహిళలను స్వశక్తులుగా చేసేది విద్యేనని వివరించారు. విద్యాభివృద్ధి విషయంలో కేంద్రం రాష్ట్రాలకు పూర్తి స్వేచ్ఛనిస్తోందని సాయం అందించడంలో వెనుకడుగు వేయమని వివరించారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకలుగా కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ విద్యాలయాలు నిలుస్తున్నాయన్నారు. కొత్తగా ఏర్పాటు చేయబోయే కేంద్రీయ విద్యాలయంలో



ఒకటి నుంచి 5 వరకు తరగతులుంటాయని, అదనపు సెక్షన్ల కొరకు ప్రతిపాదనలు పంపిచాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఉన్నత విద్యాపరంగా జిల్లా ఎంతో అభివృద్ధి సాధించిందని అన్నారు. 50 శాతం




మహిళా రిజర్వేషన్లతో పాలన మారనుందని, ఇకపై సమాజాభివృద్ధిలో మహిళలు కీలకపాత్ర పోషిస్తారని అన్నారు. కరీంనగర్ ఎంపీ పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కరీంనగర్‌లో కేంద్రీయ విద్యాలయం రావడానికి ఎంతో కృషి చేయటం జరిగిందని, ఇందుకు సహకరించిన వారందరికి ధన్యవాదాలు తెలిపారు. అయిదు వేలమంది విద్యార్థినులు చదువుకునే మహిళా డిగ్రీ కళాశాలలో పురాతన పరిపాలన భవనం, తరగతి గదులు శిథిలావస్థలో ఉన్నాయని, వాటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్తు ఛైర్మన్ అడ్లూరి లక్ష్మన్‌కుమార్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, శాసనసభ్యులు ఈటెల రాజేందర్, సుద్దాల దేవయ్య, ప్రవీణ్‌రెడ్డి, సోమారపు సత్యనారాయణ, కలెక్టర్ స్మితా సబర్వాల్, కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షుడు కొండూరి రవీందర్ రావు, బొమ్మ వెంకన్న, కె. సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు.

★★★★★

# క్షమించండి ప్లీజ్!

- కె. యన్. మూర్తి.

**తెలుగుదేశం పార్టీ క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటోంది, ముఖ్యంగా తెలంగాణ సమస్య బాబుని భయపెడుతోంది. మహానాడు వేదికపై నుంచి తెలంగాణ సమస్యపై స్పష్టత ఇవ్వలేదని విమర్శలు వినపడుతున్నాయి. మరో వైపు సీమాంధ్రలో జగన్ పార్టీ బలపడుతోంది. ఇవన్నీ బయటసమస్యలు అయితే హరికృష్ణ, జూనియర్ ఎన్టీఆర్‌లు అంతర్గతంగా సమస్యలు సృష్టిస్తున్నాయి. ఈ నేపద్యంలోనే తను మారిపోయానని బాబు పదే పదే చెబుతున్నారు.**



అమ్మలారా! అయ్యలారా!
అక్కలూ చెల్లెళ్ళూ! అన్నలూ తమ్ముళ్ళూ!
నన్ను క్షమించండి!!
తెలుగుదేశం పాలనతో మీ మనసు నొచ్చుకుంటే అందుకు
బేషరతుగా క్షమాపణలు చెబుతున్నా!
సీఎంగా ఉన్నప్పుడు కీర్తి ప్రతిష్టల్ని ఆశించి తీసుకున్న నిర్ణయాలేవైనా
మీ మనసు నొప్పించి ఉంటే మన్నించమని కోరేందుకు ఎలాంటి భేషజాలు లేవు.
ఉద్యోగులూ, రైతులూ మీరు కూడా క్షమించాలి
నేను తొమ్మిదేళ్ళు సీఎంగా ఉన్నా, రెండోసారి విపక్ష నేతగా కొనసాగుతున్నా
అదంతా పార్టీ శ్రేణుల
సమిష్టికృషే తప్ప నా గొప్పదనం కాదు.
ఈ అవకాశమిచ్చిన మిమ్మల్ని, కార్యకర్తలను ఎప్పటికీ మర్చిపోలేను.
పార్టీ అధినేతగా ప్రజల బాధల్ని చూశాను.
నేను బాగానే పాలించినా సంక్షేమ పథకాలను అమలు చేయలేకపోయా.
కార్యకర్తలు కదలి రండి, నా హయంలో జరిగిన తప్పులపై
ప్రజల్లోకి వెళ్ళి క్షమాపణలు కోరదాం.
తెలుగు వారికి పేరు తేవాలన్న ఆశ తప్ప నాకెలాంటి కోరికలూ లేవు.
మహానాడు వేదిక పై నుంచి బాబు గారి ఆవేదన ఇది.
మారిపోయానని బాబు చెబుతున్నారు
మన్నిస్తారా మరి!

**ఎన్టీఆర్‌ను పదవి నుంచి దించుతానని అనుకోలేదు**

వెన్నుపోటు రాజకీయాల గురించి టిడీపీ అధినేత చంద్రబాబు
చాలా కాలం తర్వాత నోరు విప్పారు.
తన తిరుగుబాటుని సమర్ధించుకున్నారు.
ఎన్టీఆర్ తన మామే కాదని రాజకీయ గురువు, ఆరాధ్య దైవం
అని మహానాడు వేదికపై ఆయన ఎన్టీఆర్‌ని





పొగిడారు.
కేవలం దుష్టశక్తి నుంచి పార్టీని కాపాడటానికే ప్రజాస్వామ్య బద్ధంగా
తిరుగుబాటు చేసానని పేర్కొన్నారు.
ఎన్టీఆర్‌కి తను వెన్నుపోటు పొడిచానని రాజకీయ ప్రత్యర్థులు
చేస్తున్న ఆరోపణలపై మహానాడు వేదికపై నుంచి తనకు తానుగానే
సమాధానమిచ్చారు.
బాబు ఏ ఉద్దేశ్యంతో మాట్లాడినా
ప్రత్యర్థులకు మళ్ళీ విమర్శలు చేసేందుకు అవకాశమిచ్చారు.
బాబు ఈ వేళ ఎన్ని సంజాయిషీలు చెప్పినా "జామాత దశమ గ్రహ" కాన్సెప్ట్‌లో
ఎన్టీఆర్ మాటలు విన్నవారు చంద్రబాబు మాటలను అంత త్వరగా నమ్మరేమో..

## భారత రత్నం ఎన్టీఆర్‌కి రాకుండా అడ్డుపడింది బాబేనా?

ఎన్టీఆర్‌కి భారతరత్న అవార్డు ఇవ్వాలని డిమాండ్ చేసి చంద్రబాబు విమర్శల పాలయ్యారు.
ఎన్టీఆర్ కుమార్తె కేంద్ర మంత్రి పురందేశ్వరి బాబుపై విరుచుకుపడ్డారు.
అధికారంలో వుండగా బాబు గారికి భారత రత్న విషయం గుర్తుకు రాలేదా
అని ఆమె దుయ్యబట్టారు. ఎన్డీయే నే తన చెప్పుచేతల్లో ఉంచుకున్న
బాబు ఆనాడు ఇదే డిమాండ్ చేసి వుంటే తప్పక భారతరత్న ఎన్టీఆర్‌కి దక్కేదన్నారు. కనీసం పార్లమెంట్‌లో ఎన్టీఆర్ విగ్రహం
కూడా బాబు పెట్టించలేకపోయారని పురందేశ్వరి విమర్శించారు.
ఈ విమర్శలకు జవాబు చెప్పడం చంద్రబాబుకి కష్టమే. ఆయన హయాంలో
ఎన్టీఆర్ గురించి పట్టించుకోని మాట వాస్తవమే. అది అందరికి తెలిసిన విషయమే.
ఎన్టీఆర్‌కి భారతరత్న ప్రకటిస్తే ఆయన తరుపున లక్ష్మిపార్వతికి ఇస్తారు.
ఆమె ఆ అవార్డ్ అందుకో కూడదనే అప్పట్లో బాబు ఎన్టీఆర్ పేరున
సిఫారసు చేయలేదని పార్టీ వర్గాల్లో ప్రచారం జరిగింది.

## లోకేష్ పోస్టర్స్ ఫుల్ ఎన్టీఆర్ పోస్టర్స్ నిల్

చంద్రబాబు రాజకీయ వారసుడు లోకేష్ మహానాడుకి హాజరు కాలేదు. అయితే లోకేష్ చిత్రాలున్న పోస్టర్స్, కటౌట్లు పెద్ద ఎత్తున మహానాడులో కన్పించాయి.
జూనియర్ ఎన్టీఆర్ పోస్టర్స్ కానీ, కటౌట్లు కానీ ఎక్కడా లేవు.
గత ఏడాది మహానాడుకి వచ్చిన జూనియర్ ఎన్టీఆర్
ఈ సారి దుమ్మా కొట్టారు
ఇక రాజ్యసభ సభ్యుడు నందమూరి హరికృష్ణ మహానాడులో
ఏ హడావుడి లేకుండా అంటీముట్టనట్లుగా ఉన్నారు.
గత ఏడాది అన్నీ తానై వ్యవహరించిన వారే ఈ సారి
మౌనంగా, గుంభనంగా ఉన్నారు. తొలిరోజు మధ్యాహ్నం నుంచే
ఆయన ఇంటికి వెళ్ళిపోయారు.
నారా లోకేష్‌కి పార్టీ పగ్గాలు అప్పగించడానికి బావ
చంద్రబాబు పావులు కదుపుతున్న
తీరుపై ఆగ్రహమే ఇందుకు కారణమని అంటున్నారు.
రెండో రోజు వారిని ప్రతినిధుల నుద్దేశించి మాట్లాడమని సీనియర్ నేత
యనమల రామకృష్ణుడు కోరగా ఆయనపై హరి కోప్పడ్డారు. పార్టీ వర్గాల్లో
ఈ విషయం చర్చనీయాంశంగా మారింది.

## నాగం సస్పెన్షన్

సీనియర్ నేత నాగంను టీడీపీ నుంచి బహిష్కరించారు.
నాగం కూడా సస్పెన్షన్‌ను కోరుకున్నారు, చివరకి అదే జరిగింది.
దీంతో టీడీపీతో నాగం అనుబంధం తెగిపోయింది.
ఒక పొలిట్ బ్యూరో సభ్యునిపై వేటు వేయడం ఇదే తొలిసారి.
ఇక ఇపుడు నాగం ఏమి చేస్తారు ?
పార్టీ పెడతారా?? లేక పార్టీ రహిత ఉద్యమం చేస్తారా?? అనేది తేలాల్సి ఉంది.
పార్టీ రహిత ఉద్యమం వల్ల రాజకీయ ప్రయోజనాలు నెరవేరవు.
ఆ విషయం నాగంకి తెలియనిది కాదు. పార్టీ ఏర్పాటుకి నాగం ఇప్పటికే

సిద్ధం అయినట్లు సమాచారం. టీ ఆర్ ఎస్‌కి పోటీగా సొంత పార్టీతో తెలంగాణ ఉద్యమం నడపాలని నాగం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే రెడ్డి సామాజిక వర్గాన్ని కలుపుకు పోవాలని యోచిస్తున్నట్లుగా చెబుతున్నారు. అయితే పార్టీ పెట్టి దాన్ని నడపాలన్నా, ఉద్యమం నడపాలన్నా అంత సులభమైన వ్యవహారం కాదు. గతంలో బీసీ నేత దేవందర్ గౌడ్ కూడా నవల తెలంగాణ పేరిట పార్టీ పెట్టి చివరకు దాన్ని పీఆర్పీలో విలీనం చేసి ఎన్నికల్లో పోటీ చేసి డిపాజిట్లు కోల్పోయారు. దేవేందర్ ఆశించినట్టు బీసీలు ఆయనను నమ్మలేదు. చివరకి దేవేందర్ మళ్లీ



టీడీపీ లో చేరారు. ఇదిలా ఉంటే ఇపుడు నాగంకి మద్దతుగా నిలబడే ఎమ్మెల్యేలు ఎందరు వుంటారు? నాగంను సస్పెండ్ చేసే కొద్ది గంటల ముందే వేణుగోపాల చారి చంద్రబాబుని కలసి పార్టీలో కొనసాగుతానని హామీ ఇచ్చారు. ఇది నాగం ఊహించని మలుపు. ఇక మిగిలింది హరీశ్వర రెడ్డి, జోగు రామన్నలే, వీరిని కూడా మేనేజ్ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. నాగంను ఒంటరిని చేసేందుకే బాబు ప్రయత్నిస్తారు. ఈ ఆటుపోట్లను తట్టుకొని నాగం ఏమి చేస్తారో కొంతకాలం పోతే గానీ తేలదు.

మొత్తం మీద తెలంగాణలో కేసీఆర్ లాగా హీరో కావడం అంత సులభమేమీ కాదు.

# సీఎంలో కొత్త ధీమా

రాష్ట్ర ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఇక తన పదవికి డోకా లేదని సంతోషంగా వున్నారు. ఈ నేపథ్యంలోనే ఇష్టదైవం శ్రీ వేంకటేశ్వర స్వామికి తలనీలాలు సమర్పించుకున్నారు. ఒక ముఖ్యమంత్రి హోదాలో ఉండి గుండు గీయించుకున్న తొలి ముఖ్యమంత్రిగా కేకేఆర్ రికార్డులలో కెక్కారు. సీఎం తలనీలాలు సమర్పించుకోవటానికి పలు కారణాలు చెబుతున్నారు. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల తర్వాత తన సీఎం పీఠం పదిలంగా ఉంటే కొండకు వచ్చి మొక్కు తీర్చుకుంటానని కేకే ఆర్ మొక్కుకున్నట్లు సమాచారం.. పైగా తనకెంతో దగ్గరి వ్యక్తైన ఆజాద్ రాష్ట్ర ఇంచార్జిగా నియమితుడవ్వడం, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిని మార్చే ప్రసక్తే లేదని 2014 వరకు కిరణ్



ముఖ్యమంత్రిగా కొనసాగుతారని ఆజాద్ స్పష్టం చెయ్యడంతో కిరణ్ సరి కొత్త ఉత్సాహం తో ఉన్నారు. ఇక మంత్రులంతా ముఖ్యమంత్రికి సహకరించి తీరాల్సిందేనని కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం. దీంతో తన సర్కార్‌ని కదిలించేవారు లేరనే ధీమా కిరణ్‌లో కనపడుతోంది.

## కేబినేట్‌లో కోవర్టులు లేరు

రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జ్ గులాం నబీ ఆజాద్ రాష్ట్రానికొచ్చిన సందర్భంగా రాష్ట్ర కేబినేట్‌లో కోవర్టులు ఉన్నారని మీడియాలో ప్రచారం జోరుగా సాగింది. కొందరు నేతలు పరస్పరం ఆరోపణలు కూడా చేసుకున్నారు ఈ వ్యవహారం పెద్ద తల నొప్పిగా మారడంతో తన కేబినేట్‌లో కోవర్టులు ఎవరు లేరని సీఎం కిరణ్ వివరణ ఇచ్చుకున్నారు. కోవర్టులు ఉన్నారనే మాట మీడియా కల్పన అని ఆయన తేల్చేసారు. కేబినేట్‌లో వున్న మంత్రలందరిపైన తనకు నమ్మకం ఉదని చెప్పారు. తనకు ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యేలతో, మంత్రులతో 15-20 ఏళ్ళ అనుబంధం ఉందని చెప్పారు. కోవర్టులు గా పనిచేయాల్సిన అవసరం ఎవరికి లేదన్నారు. వారందరిపై నమ్మకం ఉంది కాబట్టే కేబినేట్‌లోకి మంత్రులుగా తీసుకున్నామని స్పష్టం చేసారు. తామందరం కలసి పని చేస్తున్నామని పేర్కొన్నారు. మీడియాలో వచ్చిన అభిప్రాయాలకు తనకు సంబంధం లేదని చెప్పారు.

# స్పీకర్‌గా నాదెండ్ల మనోహర్



రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా నాదెండ్ల మనోహర్, డిప్యూటి స్పీకర్‌గా భట్టి విక్రమార్కలు ఎన్నికయ్యారు. ఇదే శాసన సభలో ఇంతకు ముందు డిప్యూటి స్పీకర్‌గా నాదెండ్ల మనోహర్ పనిచేశారు. మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు తనయుడు అయిన మనోహర్ తెనాలి నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇక భట్టి విక్రమార్క ఇంతకు ముందు చీఫ్ విప్‌గా చేసారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గానికి ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇద్దరు కూడా సీఎం కిరణ్‌కు క్లాసు మేట్స్ కావడం విశేషం. తెలుగుదేశం పార్టీ స్పీకర్, డిప్యూటి స్పీకర్ పదవులకు అభ్యర్థులను బరిలోకి దింపింది. దీంతో ఎన్నిక అనివార్యమైంది. ఎన్నికకు ముందు టీడీపీ నేతలు ప్రభుత్వం సీక్రెట్ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నిక జరుగుతుందని ప్రకటించి మళ్ళీ ఓపెన్ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నిక జరుపుతోందని నిరసన ప్రకటించారు. సభ ప్రారంభం కాగానే ప్రోటెం స్పీకర్ ఓపెన్ బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నిక జరుగుతుందని ప్రకటించారు.

అనూహ్యంగా నెలకొన్న ఈ గందరగోళం నడుమ రెండు పద్ధతుల్లో ఎన్నిక జరిగింది. తొలుత మూజువాణి పద్ధతిలో ఎన్నిక జరగగా ఈ పద్ధతిని తెలుగుదేశం వ్యతిరేకించింది. ఈ సందర్భంగా విపక్ష నేత చంద్రబాబుమాట్లాడుతూ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. తొలుత సీక్రెట్ బ్యాలెట్ అని మళ్ళీ ఓపెన్ బ్యాలెట్‌గా ఎందుకు మార్చారని ధ్వజమెత్తారు. విపక్షాలను సంప్రదించకుండా మీ కిష్టమైన పద్ధతిలో ఎన్నిక జరిపారని విమర్శించారు. ఇందుకు స్పందించిన ప్రోటెం స్పీకర్ అది తన పొరపాటే అని సుప్రీంకోర్ట్ తీర్పుని గమనంలోకి తీసుకోలేదని చెప్పారు. అనంతరం మళ్ళీ డివిజన్ పద్ధతిలో ఎన్నిక జరిపించారు.


ఎన్నికల ఓట్ల లెక్కింపులో తప్పిదం

స్పీకర్‌కి వచ్చిన ఓట్ల కంటే డిప్యూటి స్పీకర్‌కి ఎక్కువ ఓట్లు వచ్చాయి. రెండు పదవులను కాంగ్రెస్ పార్టీయే గెలుచుకొంది. అలాగే టీడీపీ స్పీకర్ అభ్యర్థికి వచ్చిన ఓట్ల కంటే డిప్యూటీ స్పీకర్ అభ్యర్థికి తక్కువ ఓట్లు వచ్చాయి. ఇదెలా జరిగిందో అర్థం కాక శాసనసభ సిబ్బంది తలలు పట్టుకున్నారు. మనోహర్‌కు 158 ఓట్లు రాగా విక్రమార్కకి 6 ఓట్లు అదనంగా అంటే 164 ఓట్లు వచ్చాయి. ఇక టీడీపీ స్పీకర్ అభ్యర్థి కృష్ణమూర్తి కి 90 ఓట్లు రాగా డిప్యూటి స్పీకర్ అభ్యర్థికి 2 ఓట్లు తక్కువగా అంటే 88 ఓట్లు వచ్చాయి. ఎమ్మెల్యేలు మధ్యలో వెళ్ళిపోయారా? లేక క్రాస్ ఓటింగ్ జరిగిందా? సిబ్బంది తప్పుగా లెక్క వేసారా? అని కూపీ లాగగా ఆ రెండు తప్పులు జరిగాయని తేలింది.

స్పీకర్ ఎన్నిక ఓపెన్ బ్యాలెట్ పద్ధతిలో జరగడంతో జగన్ వర్గం ఎమ్మెల్యేలు కాంగ్రెస్ అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌కే ఓటేశారు. టీడీపీ నుంచి బహిష్కృతులైన నాగం జనార్ధన్ రెడ్డి, నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, బాల నాగిరెడ్డిలు టీడీపీ అభ్యర్థికి ఓటేశారు. అలాగే పీఆర్పీ ఎమ్మెల్యేలు ఏంఐఏం ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కి ఓటేశారు. అన్ని పార్టీలు విప్ జారీ చేయడం తో ఎమ్మెల్యేలు జాగ్రత్త పడ్డారు. కాగా సీపీఐ, లోకసత్తా, బీజేపీ వైఎస్సార్ కాంగ్రెస్, టీఆర్ఎస్ ఓటింగ్‌లో పాల్గొనలేదు. మొత్తం మీద 45 మంది ఎమ్మెల్యేలు సభకు హాజరు కాలేదు. కాగా ముందు ఊహించినట్టు గానే అవిశ్వాసంపై చర్చ జరగకుండానే అసెంబ్లీ నిరవధిక వాయిదా పడింది. టీడీపీ కిరణ్ సర్కార్ పై అవిశ్వాసం పెట్టేందుకు మళ్ళీ నోటీస్ కూడా ఇచ్చింది. అయితే స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక, అభినందనలు పూర్తి కాగానే స్పీకర్ సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో టీడీపీ ఎమ్మెల్యేలు నిరసనకు దిగారు. పోడియం వద్దకు దూసుకెళ్ళి బైటాయించారు. అవిశ్వాస తీర్మానంపై చర్చకు అవకాశం కల్పించాలని పట్టుపట్టారు. అయితే ఇవేవి స్పీకర్ పట్టించుకోలేదు. ఈ పరిణామంతో ఆగ్రహించిన చంద్రబాబు ఇక గవర్నర్ దగ్గర ఈ అంశంపై తేల్చుకోవాలని నిర్ణయించారు. గవర్నర్‌ని కలసి వినతి పత్రం సమర్పించారు.

– కె.యన్.మూర్తి.

# అవినీతి అంతుచూస్తాం



**అక్రమార్కులకు శిక్షలు తప్పవు**

**చేతల్లో మేమేమిటో నిరూపించుకుంటాం**

**ప్రధాని మన్మోహన్, సోనియాల వాగ్దానం**

**యూపీఏ - 2 సమాచార పత్రం విడుదల**

'అవినీతిని ఎదుర్కొంటాం... అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం... ఇదేదో మాటలు చెప్పడం కాదు... చేతల్లో వేం అంటే ఏమిటో నిరూపించుకుంటా...'

కుంభకోణాలతో పీకల్లోతు కూరుకుపోయి ప్రతిష్ఠ మసకబారుతున్న సమయంలో... యూపీఏ ప్రభుత్వం తాజాగా ప్రజలకు చేస్తున్న వాగ్దానమిది. యూపీఏ-2 ప్రభుత్వం రెండేళ్ల పదవీకాలాన్ని పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రధాని మన్మోహన్‌సింగ్, యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ ఆదివారం ప్రజల కోసం ఒక సమాచార పత్రాన్ని విడుదల చేశారు. ఇరువురూ నివేదిక ముందు మాటల్లో ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్ని ప్రస్తావించారు. ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగితే మూడు రాష్ట్రాల్లో యూపీఏ విజయం సాధించిందని సోనియా చెప్పారు. 'ఒక్కో రాష్ట్ర ఫలితం ఒక్కో సందేశం ఇచ్చింది. మొత్తం మీద ఈ సందేశాలన్నింటి సారాంశం ఒక్కటే. అదేమిటంటే ... ప్రజలు అత్యుత్తమ, సమర్థ, బాధ్యతాయుత ప్రభుత్వాన్నే కోరుకుంటున్నారు. అందువల్ల మా దృష్టి అంతా దీనిపైనే" అని సోనియా చెప్పుకొచ్చారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ సుస్థిరత కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపైనా ఉందని మన్మోహన్ అభిప్రాయపడ్డారు. ''మార్పు అనేది ప్రజాస్వామ్య రాజకీయాల్లో భాగం. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలు ఆ విషయాన్ని చాటిచెప్పాయి. ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ఘాటించాయి. అని మన్మోహన్ చెప్పారు.

## చిత్తశుద్ధిని నిరూపించుకుంటాం

అవినీతిని అడ్డుకుంటామని, కుంభకోణాలకు కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రధాని మన్మోహన్ సింగ్‌హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఈ తరహా కుంభకోణాలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. "అవినీతిని ఢీకొంటాం. చర్యలు తీసుకోవడం ద్వారా మా చిత్తశుద్ధిని నిరూపించుకుంటాం. చెప్పిన దాన్ని చేసి చూపిస్తాం" అని సోనియా పేర్కొన్నారు. 2010-11 సంవత్సరంలో పరిపాలన, అవినీతి విషయాలే పెద్ద సవాళ్లుగా తమ ముందు ఉన్నాయని ప్రధాని అన్నారు. "పరిపాలన, అవినీతి అన్న రెండు అంశాలకు సంబంధించిన పరిణామాలు బాధ్యులైన కొందరు పౌరులను క్షోభకు గురిచేశాయి. ఇవన్నీ ఆధీకృతమైన పరిణామాలే. వీటిని పరిష్కరించేందుకు యూపీఏ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. చట్టపరమైన చర్యలు తీసుకోవడం ద్వారా తప్పు చేసిన వారిని శిక్షిస్తాం. అలాగే జరిగిన తప్పులు పునరావృతం కాకుండా చర్యలు కూడా తీసుకుంటాం అని ఆయన స్పష్టం చేశారు. 2జీ కుంభకోణం, కామన్‌వెల్త్ క్రీడల్లో అవినీతి వంటి అంశాలతోపాటు రాష్ట్రాల్లో చోటుచేసుకుంటున్న ఇదే తరహా పరిణామాలను కూడా ప్రధాని ప్రస్తావించారు. "సంస్థాగత లోపాలు, పత్రికా స్వేచ్ఛ కారణంగా ఇవన్నీ బయటపడ్డాయి అని ఆయనఅన్నారు. పారదర్శకమైన పాలనను అందించేందుకు అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంటామన్నారు. కొనుగోళ్ళు, కాంట్రాక్టుల విషయంలోనూ, ప్రకృతి వనరులను వినవియోగించు కోవడంలోనూ పారదర్శకతను తెస్తామన్నారు. ప్రభుత్వ ఆర్థిక స్థితిగతులు, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, విద్య, అంతర్గత సవాళ్ళు, విదేశాంగ విధానం, వైద్య ఆరోగ్యం, రైల్వేలు, పర్యావరణం వంటి అంశాల్లో సాధించిన విజయాలను 74 పేజీల నివేదికలో పొందుపరిచారు.

సినిమా

# 'నమ్మిన బంటు' వెంకన్న చౌదరి (1960)




కారంచేడు వాస్తవ్యులు యార్లగడ్డ వెంకన్న చౌదరి 1960లో చిత్ర నిర్మాణంలో అడుగు పెట్టి శంభు ఫిలింస్ పతాకంపై 'నమ్మిన బంటు', పూజాఫలం, శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణువు కథ' చిత్రాలు నిర్మించారు. గాలి, నీరు మొదలయిన ప్రకృతి సంపద ఎవరి సొత్తూ కాదు. మానవులందరూ సంపదను సముచిత రీతిని అనుభవించడానికి అర్హులే.. అన్న సోషలిస్టు నినాదాన్ని ప్రదానాంశంగా సుంకర సత్యనారాయణ రచించిన కథను ఆధారంగా నిర్మించిన చిత్రం 'నమ్మినబంటు'.


శంభు ఫిలింస్ పతాకంపై ఆదుర్తి సుబ్బారావు దర్శకత్వంలో యార్లగడ్డ వెంకన్న చౌదరి ఈ చిత్రాన్ని నిర్మించారు. అక్కినేని నాగేశ్వరరావు, సావిత్రి, గుమ్మడి, ఎన్.వి.రంగారావు ప్రధానపాత్రలు పోషించారు. స్పెయిన్‌లోని శాన్ సెబాస్టియస్‌లో జరిగిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ఈ చిత్రం ప్రదర్శింపబడింది. స్పానిష్ సబ్ టైటిల్స్‌తోచిత్రాన్ని విడుదల చేశారు. స్పెయిన్ బుల్‌ఫైట్‌కి ప్రసిద్ధి. 'నమ్మినబంటు' చిత్రంలో రామలక్ష్మణులు అనే ఎద్దులు మేడమెట్లు ఎక్కి చేసిన ఫైట్లు అక్కడి ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. 'నమ్మినబంటు'కు రాష్ట్రపతి రజత పతకం లభించింది. తెలుగు, తమిళ భాషల్లో 'నమ్మినబంటు' చిత్రం రూపొందింది.

తెలుగులో అన్నీ పాటలు కొసరాజు రాశారు. సంగీత దర్శకుడిగా ఎన్. రాజేశ్వరరావు మూడు పాటలకు స్వరకల్పన చేశారు. తమిళంలో బాణీలు సమకూర్చే సమయంలో తమిళకవి ఉడుమలై నారాయణ కవితో అభిప్రాయభేదాలు రావడంతో రాజేశ్వరరావు చిత్రం నుండి తప్పుకున్నారు. అప్పుడుమాస్టర్ వేణుని సంగీత దర్శకుడిగా నియమించారు. సినిమాలోని అన్ని పాటలకు వేణూనే ఆర్కెస్ట్రయిజేషన్ నిర్వహించారు.



వాస్తు

# శంఖుస్థాపన చేయు విధానము



**గంటా సాయిబాబా,**
వాస్తు పరిశోదకులు, సిద్ధాంతి.
సెల్ : 9848340130

**శంఖుస్థాపన అనగా శంఖువును స్థాపించుట.**
**శంఖువు అనగా మనము నివశించుటకు కావలసిన శక్తిని ప్రసాదించునది అని అర్థము.**

కర్రతో (దూలములతో) కట్టునటు వంటి గృహమునకు కర్రతోనే శంఖును చేయవలయును. ఇటుకలతో కట్టు గృహములకు ఇటుకలతో కానీ, రాయితో కానీ చేయవచ్చును. శంఖువును కర్రతో చేయించిన యెడల ఆ శంఖువు భూమిలో ఎన్ని సంవత్సరములు పుచ్చకుండా ఉండునో అన్ని సంవత్సరములు ఆ యింటికి శుభములు కలుగజేయును.

అందువల్ల రాయితో కట్టిన గృహములు రాయితోనే శంఖువును చేయించవలెను.

ఇటుకలతో కట్టిన గృహమును ఇటుకలతో చేయించవలయును.

కఱ్ఱ శంఖువు వంకరలు లేకుండా, సుడులు, బొడిపెలు లేకుండా చూచి 12" అంగుళములతో 3 సమభాగములు గా చేసి మొదటి భాగము 4 అంచులు ఉండులాగా చేసి 2వ భాగము 8 అంచులుగా చేసి మూడవ భాగమును గుండ్రముగా చేయవలయును.

కఱ్ఱ శంఖువును కానుగ, మద్ది, వేప, చంద్ర, వెదురుతో చేయవచ్చును.

రాయితో, ఇటుకతో చేయు శంఖువును మధ్యలో గుంట చేయించి దానిలో పంచలోహము, పంచామృతము వేసి గంధము, కస్తూరి, కర్పూరములతో పూజించి నవధాన్యములు శంఖువు క్రింద పోసి ఆ పైన శంఖువును పెట్టవలయును.

శంఖుస్థాపనకు ముఖ్యముగా **నవగృహములకు నవధాన్యములు అనగా :-**

(1) వడ్లు, (2) గోదుమ, (3) కందులు, (4) పెసలు, (5) శనగలు, (6) మినుములు, (7) ఉలవలు, (8) బొబ్బర్లు, (9) నువ్వులు (పత్తిగింజలు). ఈ నువ్వులు శనిదేవునికి ప్రీతికరము. కావున ఇవి అభిషేకములకు మాత్రమే వాడవలయును. నువ్వులు బదులు పత్తిగింజలుమాత్రవే శంఖుస్థాపనకు వాడవలయును. నువ్వులు వాడరాదు.

**పంచామృతములు :** నీరు, పాలు, పెరుగు, నెయ్యి, తేనె

**పంచలోహములు :** బంగారం, వెండి, రాగి, పగడం, ముత్యం ఇవి అన్నియు శంఖుస్థాపనకు వాడవలయును. మరియు శంఖువును ఆవుపాలతో శుద్ధిచేసి, పాలు నందు నవధాన్యములు, చిల్లర డబ్బులు, పంచలోహాలు వేసి శుభ సమయమునందు పంచపురుల దారములతో (కంకణం) కట్టి శంఖుస్థాపన చేయించవలయును. పూజా కార్యక్రమము అయిన తర్వాత 5గురు ముత్తైదువులతో అయిదు బిందెల నీళ్ళుతో శంఖుస్థాపన గుంటలో పోయించవలయును. (1) బావి నీరు, (2) ఏటి నీరు, (3) కాలువ నీరు, (4) సముద్రపు నీరు, (5) మన ఇంటిలో ఉన్న నిండు బిందె నీరు ఉపయోగించ వలయును.

పై తెలిపిన నీరు లభించనప్పుడు సముద్రపు నీరు, మొదలగునవి సీసాలతో తెచ్చి 5 బిందెలలో పోసి శంఖుస్థాపనకు ఉపయోగించవచ్చును.

**గమనిక :** శంఖువు పెట్టు సందర్భమున దంపతులచే గాయిత్రి మంత్రమును తప్పకుండా చదివించవలయును. ఇక టెంకాయలు 5గురు ముత్తైదువులచే కొట్టించి ఆ నీటిని శంఖువు మీద పోయించవలయును. వాస్తుపూజ, భూమి పూజ, శంఖు స్థాపన అయిన పిమ్మట గుంటకు నాలుగు మూలలు కర్పూరం వెలిగించవలయును. తమలపాకు నందు కర్పూరం వెలిగించి నీటిలో వదల వలయును. నిమ్మకాయలు కోసి, చందనం కానీ, కుంకుమ కానీ అద్ది గుంట నాలుగు మూలలు ఉంచవలయును. మొత్తము పూర్తి అయిన పిదప ఆ గుంటపై కప్పు రేకు కానీ, తడికెలు కానీ వేసి ఉంచవలయును. లేనిచో అందు నల్లని వస్తువుక ఆనీ, పక్షులు కానీ జంతువులు కానీ పడకుండా చూడవలయును.

అలా కానీ పక్షములో అశుభములు జరుగును. శంఖుస్థాపన జరిగిన రోజు నుండి 27 రోజులలో గృహారంభము చేయవలయును. లేని పక్షములో శంఖుస్థాపన నిర్వీర్యము అగును. ఏ నక్షత్రములో శంఖుస్థాపన చేయుదురో మరలా ఆ నక్షత్రములోపల గృహారంభము తప్పక చేయవలయును. 27 రోజులు దాటిన పక్షములో ఆ స్థలము నందు వాస్తు హోమం జరిపించి గృహారంభము చేయవలయును. తదుపరి సంచికలో వాస్తు హోమం గురించి తెలుసుకుందాం.

## వర్గులు పేరు - ద్వార నిర్ణయము

గత సంచికలో ద్వారముల యొక్క దిశలు తెలుసుకొన్నాము. ద్వారములకు దిశ వర్గు మీ పేరు మొదటి అక్షరముతో సరిచూసుకొనవలయును.

| మొదటి అక్షరం | వర్గు | సరిపోయే సింహద్వారం | సరిపడని సింహద్వారం |
|---|---|---|---|
| 1. అ, ఇ, ఉ, ఋ, ఎ, ఐ, ఒ, అం | 'అ' | తూర్పు, పడమర, దక్షిణం | ఉత్తరం |
| 2. క, ఖ, గ, ఘ, జ | 'క' | దక్షిణం, పడమర | తూర్పు, ఉత్తరం |
| 3. చ, ఛ, జ, ఝ, ఞ | 'చ' | తూర్పు, ఉత్తరం, పడమర | దక్షిణం |
| 4. ట, ఠ, డ, ఢ, ణ | 'ట' | తూర్పు, ఉత్తరం, పడమర | దక్షిణం |
| 5. త, థ, ద, ధ, న | 'త' | తూర్పు, ఉత్తరం | దక్షిణం, పడమర |
| 6. ప, ఫ, బ, భ, మ | 'ప' | తూర్పు, ఉత్తరం | దక్షిణం, పడమర |
| 7. య, ర, ల, వ | 'య' | తూర్పు, పడమర, దక్షిణం | ఉత్తరం |
| 8. శ, ష, స, హ | 'శ' | తూర్పు, దక్షిణం | ఉత్తరం, పడమర |

పై వర్గు ప్రకారం మీ పేరులోని మొదటి అక్షరంను అనుసరించి మీ ద్వారములు పెట్టుకొనిన మంచి శుభ ఫలితములే కాక ఆయుః వృద్ధి, ఆరోగ్యము శత్రునాశనము, సంపదలు పెరుగును.


## గుండ్లకమ్మ మాస పత్రికకు చందా దారులుగా చేరాలనుకుంటున్నారా!

రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక సర్కులేషన్ కలిగి మల్టీ కలర్‌తో గ్రామీణ ప్రాంతమునుండి వెలువడుతూ, పాఠకుల విశేష ఆదరాభిమానాలు పొందుతున్న "గుండ్లకమ్మ" మాస పత్రికకు చందాదారులుగా చేరండి

ప్రతి నెల మీ ఇంటికి పోస్టు ద్వారా తెప్పించుకోండి.

**రెండు సంవత్సరముల చందా రూ.200/- లను**

**"అఖిల్ పబ్లికేషన్స్" పేరుతో డి.డి. లేదా యం.ఓ.ను**

మీ పూర్తి అడ్రస్సుతో ఈ క్రింది చిరునామాకు పంపగలరు...

**అఖిల్ పబ్లికేషన్స్, కాకాని పాలెం, అద్దంకి. ప్రకాశం జిల్లా. ఫోన్: 98485 59566**



# తిరుక్కుఱళ్ - శ్రీవాణి

- డాక్టర్ గాలి గుణశేఖర్
ప్రిన్సిపల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అద్దంకి.



## 10. మధుర భాషణం

**91. మధుర భాషణం బేదన మంచివారి**
**ప్రేమమిళిత నిష్కపటమౌ ప్రియవచనము**
ఇంపైన మాట ఏదంటే – సజ్జనులైన వారి అనురాగంతో కూడిన కల్మషం లేని హితమైన మాట.

**92. వదన మలర పలుకు టదియె శ్రేష్ఠం బగు**
**ఎన్నగ మది యలరి యిడుట కంటె**
సంతోషంలో ఇతరులకు ఆనందం కలిగించే విధంగా మాట్లాడటం శ్రేష్ఠతమం. అది మనస్సు పరవశించి దానం చెయ్యడం కన్నా ఉత్తమం.

**93. ఇమ్ముగగని, మోము నింపుగ నిడి మన**
**మలర మాటలాడు టది మధురము**
ప్రసన్నమైన ముఖంతో, అనురాగాన్ని ప్రదర్శించి ఇతరుల మనస్సు పరవశించే విధంగా మాట్లాడటం మధుర భాషణం చేసే లక్షణం.

**94. మంచి మాట పలుకు మనుజుని విడిపోవు**
**దుఃఖదాయి లేమి దూరముగను**
ఇంపైన మాటలలో ఇతరుల్ని అలరింపజేసే వ్యక్తి నుండి దుఃఖాన్ని కలిగించే దారిద్ర్యం దూరంగా తొలగిపోతుంది. సంపన్నుడిగా జీవిస్తాడని భావం.

**95. నెనరు గల్గు మాట, వినయగుణంబులె**
**యౌను తొడవులు; పెరలగునె చూడ**
ప్రియమైన మాటలు, అహంకారం లేని శీలం, (వినయం) ఒక వ్యక్తికి నిజమైన ఆభరణాలు. సామాన్యంగా ప్రజలు పరిగణించే ఆభరణాలు వ్యర్థమే.

**96. పరుల మేల్గోరి లెస్సగా పలుకవలయు**
**తరుగు పాపము, ధర్మము పెరుగు ధరను**
ఎల్లప్పుడు ఇతరుల మేలును ఆశించి పలికే ఇంపైన మాటలు వల్ల క్రమంగా పాపం తగ్గుతుంది. ధర్మం వర్ధిల్లుతుంది.

**97. పరుల కుపకరించు పలుకు లాడిన చాలు**
**సత్ఫలములు వాని సరసజేరు**
ఇతరులకు ప్రయోజనం కలిగించే మాటలు చెప్పడం వ్రతంగా భావించే వారికి, అన్ని విధాల శుభఫలితాలు ఒనగూరుతాయి.

**98. బాధకలుగజేయు పలుకు పరిహరింప**
**ఇహపరమ్ములందు ఎసగు సుఖము**
ఇతరులకు బాధ కల్గించే మాటలను విడిచిపెడితే, అటువంటి వ్యక్తికి ఈ లోకం లోనే కాక, పరలోకంలోను శుభం కలుగుతుంది.

**99. మధుర భాషణమున మన మలరుట గాంచి,**
**పరుషములగు వాని పలుకనేల ?**
ఇంపైన మాటల వల్ల సంతోషం కలగడం మనం చూస్తూనే ఉన్నాం. అనుభవంలో ఇది తెలిసినా కఠినమైన, బాధపెట్టే మాటల్ని వాడటం ఎందుకు?

**100. భవ్యవాక్కులుండ పరుషము లాడుట**
**పండు విడిచి కాయ బడయుటగును.**
సంతోషాన్నిచ్చే మధురమైన మాటలుండగా వాటిని ఉపయోగించక, పరుషమైన మాటల్ని ప్రయోగించడం తియ్యనైన పండు ఉండగా దాన్ని విడచి కాయను తినడం వంటిది.

## 11. కృతజ్ఞత

**101. మేలొనర్పని దానికి మేలు సలుప**
**స్వర్గ మర్త్యమ్ము లద్దాని సమము గావు**
పూర్వం తాను ఏ విధమైన సాయం చెయ్యకపోయినా, మరొకడు తనకు సాయం చేసినట్లయితే అటువంటి వ్యక్తికి స్వర్గలోక భూలోకాలను సమర్పించినా అందుకు సాటిరాదు.

**102. ఉచితకాల మెఱిగి ఒనరించు సాయమ్ము**
**భూమికంటె మించి పూజ్యమగును**
సాయం కావలసిన సమయంలో చేసే సాయం అత్యల్పమైనా, అది చేసిన సమయాన్ని బట్టి చూస్తే, ఈ భూమి కంటే (గొప్పది) నమస్కరింపదగిన అంశమవుతుంది.

**103. ఫలము కోరకుండ పరులకు మేల్సేయ**
**కడలి కన్న నద్ది ఘనము కాదె?**
ఎటువంటి ఫలితాన్ని ఆశించకుండా మానవాళికి ఉపకారం చెయ్యడమే ఆశయమైతే – అది సముద్రానికంటె మహోన్నతమవుతుంది.

**104. మేలు కొంచెమైన మేల్మిగా భావించు**
**ఫలితమందు వాడు పలు విధముల**
కృతజ్ఞతాభావం కలిగిన వాడు – తాను పొందిన సాయం చిన్నదైనా, అన్ని విధాల అది ఉత్తమ సహాయంగా భావిస్తాడు.

**105. మొదటి మేలు సమము కాదు బదులు మేలు,**
**పదయు వాని నైజము మేర ప్రతిఫలించు**
ప్రత్యుపకారంగా చేసే సాయం తొలుత పొందిన సాయానికి సాటికాదు. కాని ఆ సాయం పొందేవాడి సంస్కారాన్ని బట్టి ఉంటుంది. (ప్రత్యుపకారంగా పొందే మేలును కృతజ్ఞుడు తొలిసాయంగానే భావిస్తాడు).

**106. సాధుజనుల చెలిమి, సంకటంబుల తోడు**
**వచ్చు వారి మైత్రి వదలరాదు**
మంచి శీలం గలవారి స్నేహాన్ని, కష్టసమయాలలో తగిన సాయం అందించిన వారి స్నేహాన్ని ఎప్పటికీ మరిచి పోక కొనసాగించాలి.

**107. సాయపడిన వాని జన్మలేడింటను**
**మాన్యులైన వారు మరువకుండ్రు**
తమను ఆపదలందు ఆదుకున్న వారిని, కృతజ్ఞులైన, పెద్దవారు ఈ జన్మలోనే కాదు ఏడేడు జన్మలందు సైతం మరిచిపోరు. కృతజ్ఞతాభావాన్ని ప్రదర్శిస్తారు.

**108. మేలు మరచుటెపుడు మేలిమి కాదిల**
**కీడు మరచు టెల్ల పాడియగును.**
పొందిన సాయాన్ని మరచి కృతఘ్నుడు కావడం అధర్మం. ఎప్పుడూ కృతజ్ఞతగా ఉండాలి. కాని తమకు కలిగిన కీడును వెంటనే విస్మరించడం మంచిది.

**109. సాయమొసగి నరుడు చావు దెచ్చిన కూడ**
**తొలుత మేలు తలప తొలగు చింత**
తనకు మేలు చేసిన వ్యక్తి, తర్వాత మరణం అంతటి ముప్పును తెచ్చినా, ముందు తనకు అతడు చేసిన సాయాన్ని స్మరించడం వల్ల ఆ బాధ తొలగిపోతుంది. తొలుత పొందిన మేలును భావించి అతన్ని క్షమించడం ధర్మం. (నింద కూడా మరణ సమమే).

**110. ధర్మమెద్ది యైన తప్పునగును కాని**
**మేలు మరతురేని మిగుల కీడు**
ఎటువంటి ధర్మచ్యుతి (అధర్మ ప్రవర్తన) అయినా అందులోంచి బయట పడే అవకాశం ఉందికాని, కృతజ్ఞత అనే ధర్మాన్ని పాటించనట్లయితే పతనం తథ్యం.